ప్రతి అక్షరం - ప్రజల కోసం
# రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
యాదాద్రి భువనగిరి
పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 160
మంగళవారం 10 డిసెంబర్ 2024
చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్
HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## భారత జట్టుకు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ కష్టమేనా?




.. వివరాలు 7లో



## గ్రూప్-2 యథాతథం

వాయిదా వేయలేం!

హైకోర్టు స్పష్టీకరణ

పిటిషన్ల కొట్టివేత

.. వివరాలు 2లో



## ఆర్బీఐ కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా

రేపు బాధ్యతల స్వీకారం

మూడేళ్లపాటు ఆ పదవిలో

నేటితో ముగియనున్న

ప్రస్తుత గవర్నర్ శక్తికాంత దాస్ పదవీకాలం

.. వివరాలు 2లో





# సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### తెలంగాణ అంటేనే కవులు, కళాకారులకు పుట్టినిల్లు

- డిసెంబర్ 9 తెలంగాణ ప్రజలకు ఇష్టమైన రోజు
- తెలంగాణ తల్లిని ప్రతిష్ఠించుకోవడం మన అదృష్టం
- గతంలో ఒక పార్టీ తమ కుటుంబం కోసమే ఆలోచించింది
- కాంగ్రెస్ పార్టీ మాత్రం ప్రజల కోసం ఆలోచిస్తుందన్నాది
- పదేళ్లలో బీఆర్ఎస్ అప్పులకుప్పగా మార్చింది
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 'టీజీ'గా 'టీఎస్'
- సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు
- తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం
- పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు
- అందెశ్రీని సన్మానించిన సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, రోమింగ్ న్యూస్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాయంత్రం హైదరాబాదులో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. సచివాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 20 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. వేదమంత్రాల సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు.

విగ్రహావిష్కరణ

మిగతా 2 లో

# ఇది టెక్, డేటా శతాబ్దం

### రిఫార్మ్, పెర్ఫార్మ్, ట్రాన్స్ ఫార్మ్ అభివృద్ధి

- గత పదేళ్లలో అన్నిరంగాల్లోనూ విశేష ప్రగతి
- ప్రపంచ పెట్టుబడులకు భారత్ గమ్యంగా మారింది
- రాజస్థాన్ పెట్టుబడుల సదస్సులో ప్రధాని మోడీ
- హర్యానా అభివృద్ధికి బీజేపీ 3.0 వేగంగా పనిచేస్తోంది
- మహిళల సాధికారతకు బీమా సఖీ యోజన ప్రారంభం



**ప్రపంచ వ్యాప్తంగా ప్రతి పెట్టుబడిదారుడు భారత్ వైపు ఆసక్తిగా చూస్తున్నాడని. మనదేశంలో పెట్టుబడులు. పెట్టేందుకు ఉత్సాహంగా ఉన్నారని ప్రధాని మోడీ చెప్పారు. ది రైజింగ్ రాజస్థాన్ గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్- 2024లో ఆయన సోమవారం పాల్గొన్నారు.**

జైపూర్/పానిపట్: రిఫార్మ్. పెర్ఫార్మ్, ట్రాన్స్ ఫార్మ్ అనే భారత్ అభివృద్ధి మంత్రం ప్రతిరంగంలో కనిపిస్తోందని అన్నారు. గత పదేళ్లలో భారత్ 10వ ఆర్థిక వ్యవస్థ నుంచి ఐదవ ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించిందని, ఎగుమతులు రెట్టింపయ్యాయనీ, ఎఫ్ఎఐలు

మిగతా 2 లో




## దేశాన్ని అస్థిరపర్చే కుట్ర!

సోరోస్ నిధులిస్తున్న సంస్థతో సోనియాకు సంబంధాలు

బీజేపీ అధ్యక్షుడు నడ్డా ఆరోపణలు

తీవ్రంగా ఖండించిన కాంగ్రెస్ చీఫ్ ఖర్గే

రాజ్యసభలో ఇద్దరి మధ్య మాటల యుద్ధం

### విదేశీ శక్తుల 'సాధనం'గా కాంగ్రెస్..

న్యూఢిల్లీ, రోమింగ్ న్యూస్ : పార్లమెంట్ సమావేశాల్లో అదానీ అంశంపై చర్చించాలని విపక్షాలు పట్టుబడుతున్న నేపథ్యంలో అధికార బీజేపీకి 'జార్జ్ సోరోస్' అస్త్రం దొరికింది. అమెరికన్-హంగేరియన్ వ్యాపారవేత్త జార్జ్ సోరోస్ ఫౌండేషన్ నిధులు సమకూరుస్తున్న సంస్థతో

మిగతా 3 లో



02

## ఐసిస్ శిబిరాలపై అమెరికా దాడులు

అధికారికంగా ప్రకటించిన అమెరికా

- ఐసిస్ మళ్లీ బలపడకుండా దాడి చేశామన్న జో బైడెన్
- సిరియాలో అనూహ్య పరిణామాలు
- పరిస్థితులను నిశితంగా గమనిస్తున్న భారత్

# అదానీ, రేవంత్ భాయ్ భాయ్..

## అసెంబ్లీ గేటు వద్ద టీషర్ట్ లొల్లి!

- బీఆర్ఎస్ నాయకులను అడ్డుకున్న పోలీసులు
- పోలీసులను నిలదీసిన కేటీఆర్
- కేటీఆర్ఎస్ పోలీస్‌స్టేషన్‌కు తరలింపు


హైదరాబాద్, రోమింగ్ న్యూస్ : తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద టీ షర్ట్స్ లొల్లి జరిగింది. అదానీ రేవంత్ భాయ్ భాయ్ అంటూ బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. అదానీ, రేవంత్ ఫొటోలు ఉన్న టీ షర్టులను ధరించి అసెంబ్లికి రావడంతో.. బీఆర్ఎస్ సభ్యులను గేటు వద్దే అడ్డుకున్నారు. దీంతో అసెంబ్లీ గేటువద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ధర్నా చేశారు. అటు అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను

మిగతా 2 లో



## తెలుగు సబ్జెక్ట్ తప్పని సరేం కాదు

- 9, 10 తరగతుల సిలబస్ లో స్వల్ప మార్పు
- నిబంధనను 8వ తరగతి వరకు మాత్రమే అమలు చేయాలి
- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం




04



### కోఠి డీఎంఈ కార్యాలయం ముందు

## ఆశా వర్కర్ల ఆందోళన

**18000 ఫిక్స్‌డ్ జీతాలు ఇవ్వాలని డిమాండ్**

- కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీసులు
- ఆశా వర్కర్లపై చేయి చేసుకున్న పోలీసులు
- ఇద్దరు ఆశా వర్కర్ల పరిస్థితి విషమం
- ఆశా వర్కర్లపై దాడిని ఖండించిన హరీశ్‌రావు
- మాతృమూర్తులపై మగ పోలీసులతో దౌర్జన్యామా..?
- సీఎం రేవంత్‌పై నిప్పులు చెరిగిన కేటీఆర్

04

## చెన్నమనేని రమేశ్ జర్మన్ పౌరుడే..

- తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు
- చెన్నమనేనికి రూ.30 లక్షల జరిమానా విధింపు



04

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
10 డిసెంబర్
2024





# సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మొదటి పేజీ తరువాయి

కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ గేయ రచయిత అందెశ్రీని సీఎం సన్మానించారు. గుండుపూసలు, హారం, ముక్కుపుడక, ఆకుపచ్చ చీర, కడియాలు, మెట్టెలతో పాటు చాకలి ఐలమ్మ, సమ్మక్క-సారక్క పోరాట స్ఫూర్తితో తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించారు. వరి, జొన్న, సజ్జలు, మొక్కజొన్న కంకులు తెలంగాణ తల్లి చేతిలో పొందుపరిచారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. సచివాలయం, ట్యాంక్ బండ్ పరిసరాలు జనసముద్రంగా మారాయి. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ రోజు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే రోజు అని అన్నారు. సోనియా జన్మదినం రోజే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ప్రకటన వచ్చిందని గుర్తు చేశారు. ఇందిరమ్మ రాజ్యం తీసుకొచ్చేందుకు అంతా కలిసి పోరాడామని అన్నారు. కాంగ్రెస్ వచ్చాక తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛ లభించిందన్నారు. డిసెంబర్ 9 తెలంగాణ ప్రజలకు ఇష్టమైన రోజని, కృష్ణా, గోదావరి నదులు హైదరాబాద్‌లో ప్రవహించినట్లు ఉందన్నారు. ఈరోజు తెలంగాణ తల్లిని ప్రతిష్ఠించుకోవడం మన అదృష్టమని, తెలంగాణ వారికి ఎన్నో అవమానాలు ఎదురయ్యాయని అన్నారు. గతంలో ఒక పార్టీ కేవలం తమ కుటుంబం కోసమే ఆలోచించిందన్నారు. గతంలో ఒక పార్టీ కేవలం తమ కుటుంబం కోసమే ఆలోచించిందని, మా పార్టీ మాత్రం ప్రజల కోసం ఆలోచిస్తుందన్నారు. యావత్ తెలంగాణ మొత్తం పండగ చేసుకునే పర్వదినం డిసెంబర్ 9గా అభివర్ణించారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పథకాలు చేపట్టి మొదటి ఏడాదిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసుకుందని, తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో ఏర్పాటు చేసుకోవడం మనందరికీ గర్వకారణమన్నారు. ఉమ్మడి రాష్ట్రం సమయంలో తెలంగాణ సంస్కృతిని అవహేళన చేశారని, నేడు మన సంస్కృతి సాంప్రదాయాలు చాటి చెప్పేలా తెలంగాణ తల్లిని ఏర్పాటు చేసుకున్నామన్నారు. గత పాలకులు కుటుంబం గురించి ఆలోచించారే కానీ యావత్ తెలంగాణ గర్వించేలా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించాలన్న ఆలోచనకు నోచుకోలేదంటూ బీఆర్ఎస్ లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. తాను తెలంగాణ తల్లిని చూసిన సమయంలో తన తల్లిని చూసిన భావన కలిగిందని, అదే భావన యావత్ తెలంగాణ కలిగే విధంగా తెలంగాణ తల్లిని రూపొందించినట్లు తెలిపారు. తెలంగాణ అంటేనే కవులు, కళాకారులకు పుట్టినిల్లని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తాము 'టీఎస్'ను 'టీజీ'గా మార్చామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి



రేవంత్ రెడ్డి అన్నారు. ఉద్యమం ఉవ్వెత్తున ఉన్న రోజుల్లో అందరూ 'టీజీ' అని రాసుకున్నారని గుర్తు చేశారు. కానీ గత ప్రభుత్వం 'టీఎస్' అని తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ప్రతిచోట 'జయ జయహే తెలంగాణ' వినిపించేదని, కానీ రాష్ట్రం వచ్చాక ఆ గేయానికి గౌరవం దక్కలేదని విమర్శించారు. అందుకే తాము ఈ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించామన్నారు. తెలంగాణ పదేళ్ల పాటు వివక్షకు గురైందన్నారు. ఎందరో కవులు, కళాకారులు ఉద్యమానికి ఊపిరిలూదారని, వారిని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని తాము సంక్షేమం వైపు నడిపిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన సమయంలో ఎందరో కవులు, కళాకారులు, రచయితలు వారి పాటలతో యావత్ తెలంగాణ యువతను చైతన్యపరిచి ఉద్యమం వైపు సాగించడంతోనే తెలంగాణ సాధ్యమైందని సీఎం అన్నారు. తెలంగాణ కోసం గొప్ప కవులు, కళాకారులు కృషి చేశారని, వారిని సన్మానించుకోవడం సత్కరించుకోవడం మన బాధ్యతగా సీఎం పేర్కొన్నారు. వారిలో గూడా అంజయ్య, గద్దరన్న, బండి యాదగిరి, గోరటి వెంకన్న, సుద్దాల అశోక్ తేజ, పాశం యాదగిరి, యాదగిరి రావులకు ఫ్యూచర్స్ సిటీలో 300 గజాల స్థలము, ప్రభుత్వం నుండి కోటి రూపాయల ఆర్థిక సాయం, తామర పత్రాన్ని కూడా అందజేస్తున్నట్లు సీఎం బహిరంగ సభ సాక్షిగా ప్రకటించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. పదేళ్లలో బీఆర్ఎస్ అప్పులకుప్పగా మార్చిందని దుయ్యబట్టారు. ఇందిరమ్మ రాజ్యం తీసుకొచ్చేందుకు అంతా కలిసి పోరాడామని, కాంగ్రెస్ వచ్చిన తర్వాతే రాష్ట్ర ప్రజలకు ఎంతగానో స్వేచ్ఛ లభించిందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించామని, అలాగే రూ.21 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. బీఆర్ఎస్ చేసిన అప్పులకు రూ.64 వేలకోట్ల వడ్డీ చెల్లించామని, ఇకపై ప్రతిఏటా డిసెంబర్ 9న తెలంగాణ తల్లి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు భట్టి తెలిపారు. ఇప్పటివరకు ఎవరూ తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టలేదని, తొలిసారి తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ప్రజాపాలన విజయోత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన డ్రోన్ షో ప్రజలను ఆకట్టుకుంది. ఈ డ్రోన్ షో ద్వారా ప్రభుత్వం ఏడాది కాలంలో ప్రవేశపెట్టిన పథకాలు ప్రతిబింబించేలా ఏర్పాటు చేయడం విశేషం. ప్రజా పాలన ముగింపు ఉత్సవాల సందర్భంగా ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాలన్నీ జనసంద్రంగా మారాయి. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు గట్టి భద్రతా చర్యలు చేపట్టారు.



# ఇది టెక్, డేటా శతాబ్దం

మొదటి పేజీ తరువాయి

కూడా రెండింతలు అయ్యాయని గుర్తుచేశారు. ఈ సమయంలో దేశంలో మౌలికరంగం వ్యయాలు రూ.2 లక్షల కోట్ల నుంచి రూ. 12 లక్షల కోట్లకు చేరాయని చెప్పారు. భారత్ వంటి వైవిధ్యభరిత దేశంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లడం మనకు భారీ ప్రయోజనం. మరికొన్నేళ్లు మనం అత్యంత యువ దేశంగా ఉండబోతున్నాం. ఇక్కడే అత్యధిక మంది వైపు ణ్యవంతులైన యువకులు అంటారు. ఇది టెక్.. డేటాచోదక శతాబ్దం. గత పదేళ్లలో ఇంటర్నెట్ వినియోగం నాలుగింతలు పెరిగింది. డిజిటల్ చెల్లింపులూ భారీగా పుంజుకున్నాయి. స్వాతంత్ర్యం తర్వాత ప్రభుత్వాలు రాజస్థాన్ అభివృద్ధి, సంస్కృతిని నిర్లక్ష్యం చేశాయి. తద్వారా ఈ రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. వికాస్ భీ.. విరాసత్ భీ మంత్రంగా మా ప్రభుత్వం పనిచేస్తోంది. రాజస్థాన్లోని పరిస్థితులు పెట్టుబడులకు అనుకూలంగా ఉన్నాయి. ఇక్కడి ప్రజలు బాగా నేర్చుకుంటారు. భారత్లో అతిపెద్ద సోలార్ పార్కుల్లో చాలా వరకు ఇక్కడే ఏర్పాటవుతున్నాయి. డ్రైపోర్టులకు అత్యంత అనుకూలమైన ప్రదేశం. రెండు ఎయిర్ కార్గో కాంప్లెక్స్ లు కూడా ఏర్పాటు చేశాం అని ప్రధాని మోడీ వివరించారు. కార్యక్రమంలో రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్లాల్ తొలుత ప్రసంగించారు. ఇప్పటికే రూ.30 లక్షల కోట్ల విలువైన ఎంవోయూలు జరిగినట్లు తెలిపారు.

### బీమా సఖీ యోజనకు శ్రీకారం

హర్యానాలో బీజేపీ ప్రభుత్వం మూడో దఫా అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని ప్రధాని మోడీ అన్నారు. ప్రభుత్వ యాజమాన్యంలోని ఎల్ఐసీ 'బీమా సఖీ యోజన'ను ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో మోడీ మాట్లాడారు. రక్షణ,బ్యాంకింగ్, వ్యవసాయం సహావివిధ రంగాల్లో మహిళల సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం గత 10 ఏళ్లలో అనేక చర్యలు తీసుకుందన్నారు. దాదాపు 1.15 కోట్ల మంది మహిళలు లఖ్పతి దీదీగా మారారని ప్రధాని అన్నారు. 3 కోట్ల మంది మహిళ లను లఖిపతి దీదీగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పా రు. 'బీమా సఖి యోజన', ఎల్బీసీ ద్వారా నిర్వహించబడుతుంది. టెన్త్ ఉత్తీర్ణులైన 18-70 సంవత్సరాల వయస్సు గల మహిళలకు సాధికారత కల్పించడానికి ఈ పథకం రూపొందించబడింది. మొదటి మూడు సంవత్సరాలు ప్రత్యేక శిక్షణ. స్టైఫండ్ పొందు తారు. ఈ పథకం కింద. మహిళా ఏజెంట్లకు మొదటి సంవత్సరం నెలకు రూ.1,000, రెండవ సంవత్సరంలో నెలకు రూ.6,000, మూడవ సంవత్సరంలో నెలకు రూ.5,000 స్టైఫండ్ లభిస్తుంది. బీమా శాఖల నుంచి కమీషన్ ప్రయోజనం కూడా ఉంటుంది. రాబోయే మూడేళ్లలో 2 లక్షల బీమా సఖీలను నియమించాలనేది ప్రణాళికని మోడీ చెప్పారు.

# ఆర్బీఐ కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా

**రేపు బాధ్యతల స్వీకారం.. మూడేళ్లపాటు ఆ పదవిలో**

**నేటితో ముగియనున్న ప్రస్తుత గవర్నర్ శక్తికాంత దాస్ పదవీకాలం**



న్యూ ఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన గవర్నర్‌గా రెవెన్యూ శాఖ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా నియమి తులయ్యారు. ప్రస్తుత గవర్నర్ శక్తికాంత దాస్ పదవీ కాలం రేపు డిసెంబర్ 10 ముగియడంతో తదుపరి గవర్నర్‌ను కేంద్రం నియ మించింది. 2018లో ఆర్బీఐ గవ ర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన శక్తికాం త దాస్ పదవీ కాలం 2021లోనే ముగియగా కేంద్రం మరో మూడేళ్లు పొడిగించింది. ఈ గడువు కూడా డిసెంబర్ 10తో ముగియనుండ డంతో కొత్త గవర్నర్‌ను నియామ కానికి కేబినెట్ నియామకాల కమి టీ ఆమోదం తెలిపింది. మల్హోత్రా ఆర్‌బీఐకి 26వ గవర్నర్‌గా బాధ్య తలు చేపట్టనున్నారు. డిసెంబర్ 11 నుంచి మూడేళ్ల కాలం పాటు ఆయన ఈ పదవిలో కొనసాగు తారు. సంజయ్ మల్హోత్రా 1990 బ్యాచ్ రాజస్థాన్ బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. ఐఐటీ కాన్పూ ర్‌లో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీ రింగ్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆయన అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ పాల సీలో మాస్టర్స్ అభ్యసించారు. విద్యుత్, ఆర్థిక, పన్నులు, ఇన్ఫ ర్మేషన్ టెక్నాలజీ, మైన్స్ తదితర రంగాల్లో మూడు దశాబ్దాలకు పైగా సర్వీసులందించారు. ప్రస్తుతం కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖలోని రెవెన్యూ విభాగం కార్యదర్శిగా కొనసాగుతున్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వంలో ఆర్థిక, పన్నుల విషయంలో అపారమైన అను భవం కలిగిన ఆర్థిక, ట్యాక్సేషన్‌లో అపారమైన అనుభం కలిగిన సంజయ్ మల్హోత్రా ప్రత్యక్ష, పరోక్ష పన్నులకు సంబంధించిన విధాన రూపకల్పనలో కీలకంగా వ్యవహ రించారు.

# గ్రూప్-2 యథాతథం

**హైదరాబాద్ : గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేయలేమని తెలంగాణ హైకోర్టు తేల్చి చెప్పింది. టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రూప్ 2 పరీక్షలను వాయిదా వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు సోమవారం విచారణ జరిపింది. ఈనేపథ్యంలో గ్రూప్2 పరీక్షలను వాయిదా వేసేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయినందున వాయిదా వేయలేమని స్పష్టం చేసింది. డిసెంబర్ 16న రైల్వే పరీక్ష ఉందని, ఒకే రోజు గ్రూప్-2, రైల్వే పరీక్షలు ఉన్నందున పరీక్షను వేరే తేదీకి మార్చాలని కోరుతూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. అయితే, గ్రూప్-2 వాయిదా వేయడం వల్లలక్షల మంది అభ్యర్థులు నష్టపోతారని టీజీపీఎస్సీన్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇప్పటికే అభ్యర్థులంతా హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకున్నట్లు తెలిపారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం పరీక్షను వాయిదా వేసేందుకు నిరాకరిస్తూ పిటిషన్లు కొట్టివేసింది.**

# అదానీ, రేవంత్ భాయ్ భాయ్..

మొదటి పేజీ తరువాయి



పోలీసులు అడ్డుకున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అరెస్ట్ చేసి.. పోలీస్ స్టేషన్‌కు తరలించారు. 'ఢిల్లీలో అదానితో కుస్తీ.. గల్లీలో దోస్తీనా. రేవంత్ రెడ్డి ఎంత చెప్పినా వినడం లేదు. అందుకే టీషర్టులు ధరించి అసెంబ్లీలో నిరసన వ్యక్తం చేయబోతున్నాం. తెలంగాణ తల్లి మాది. కాంగ్రెస్ తల్లి మీది. బతకమ్మ తీసి.. చేయి గుర్తు పెడతారా' అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలోకి వెళ్లకుండా ప్రతిపక్ష నాయకులను అడ్డుకొని అరెస్టులు చేయడం పట్ల.. హరీష్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆదానీ దొంగ అని, అవినీతి చేసిండని రాహుల్ గాంధీ తిడితే.. రేవంత్ రెడ్డి ఇక్కడ చీకటి ఒప్పందాలు చేసుకుంటడు. అలయ్ బలయ్ చేసుకుంటడు. ఆదానీతో వేలకోట్ల రూపాయలు ఒప్పందాలు చేసుకుంటడు. ఇదెక్కడి న్యాయం' హరీష్ ప్రశ్నించారు. 'వివిధ మార్గాల్లో ప్రతిపక్షాలు నిరసనలు తెలియచేస్తుంటాయి. అడ్డుకోవడం దుర్మార్గం. అక్రమ సంబంధాలు, చీకటి ఒప్పందాలు బయట పడుతాయని ప్రతిపక్షాన్ని సభలోకి రాకుండా అడ్డుకుంటున్నారు. సభ ఏకపక్షంగా జరిపే ప్రయత్నం చేస్తున్నారు. ఆదానీతో చీకటి ఒప్పందం బయటపడిందని, మేము ప్రశ్నిస్తామని భయపడుతున్నరు. మమ్మల్ని సభలోకి రాకుండా ఎందుకు ఆపుతున్నావు రేవంత్ రెడ్డి? పార్లమెంట్ లో రాహుల్, ప్రియాంకలు ఆదానీ, మోదీ భాయి భాయి అనే స్లోగన్స్‌తో టీషర్ట్స్ వేసుకున్నరు. మేము ఇక్కడ అదే విధంగా మీ చీకటి ఒప్పందాన్ని ప్రశ్నిస్తే తప్పేంటి.. నువ్వు తప్పు చేసినవు కాబట్టే నీకు భయం' అని హరీష్ రావు వ్యాఖ్యానించారు. దీంతో అసెంబ్లీ గేటు-2 వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు. రేవంత్, అదానీతో కూడిన టీషర్టు ధరించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్తత నెలకొన్నది. ఈ నేపథ్యంలో పోలీసుల అధికారులను కేటీఆర్ నిలదీశారు. తమను ఎందుకు అడ్డుకుంటున్నారో చెప్పాలన్నారు. రేవంత్ అదానీ భాయి భాయి అంటూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసన వ్యక్తం చేశారు. ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ, తెలంగాణ తల్లి మాది.. కాంగ్రెస్ తల్లి నీది, బతుకమ్మను తీసి చేయి గుర్తు పెట్టిందంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ క్రమంలో కేటీఆర్, హరీశ్ రావు, కవిత, సబితా ఇంద్రారెడ్డితోపాటు పార్టీ ప్రజాప్రతినిధులు అరెస్టు చేసి పోలీసు వ్యానుల్లో అక్కడి నుంచి తరలించారు.

# ప్రతిపక్షాల గొంతునొక్కుతున్న సీఎం రేవంత్

**సీఎం ప్రసంగంలో తెలంగాణ వీరుల ప్రస్తావడం లేకపోవడం బాధాకరం : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్**

హైదరాబాద్, డిసెంబర్9 : ప్రతిపక్షాలను బంధించి, వారి గొంతు నొక్కి అసెంబ్లీలో ఏకపక్షంగా చరిత్రలో డిసెంబర్ తొమ్మిదో తారీఖు నిలిచిపోతుందని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగంలో కేసీఆర్ వీరోచిత పోరాట ప్రస్తావనే లేకపోవడం, సంకుచిత మనస్తత్వానికి అద్దం పడుతున్నది. మీరు ఈరోజు ఆంధ్ర పాలకుల స్క్రిప్టును తప్పుల్లేకుండా చదివిండని ఎవరికైనా ఇట్టే తెలిసిపోతుంది అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. సూటిగా చెప్పండి.. నవంబర్ 29న కేసీఆర్ ప్రాణత్యాగానికి సిద్ధం కాకపోతే డిసెంబర్ 9న నాటి కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేస్తుండెనా? మీ ప్రసంగంలో ఈ రోజైనా చివర్లో 'జై తెలంగాణ' అనే ధైర్యం, దమ్ము లేని మీరు సోమవారం సాయంత్రం మళ్లీ అందరినీ తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు రండి అంటున్నరు! ఏ ముఖం పెట్టుకోని రావాలె తెలంగాణ ప్రజలు? మీకు అదానీ-ఆమ్దానీలే ముఖ్యం.

# రాజన్న కోడెలను కబేళాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు

**నిబంధనలకు విరుద్ధంగా అప్పగించినట్టు పలు ఆధారాలు**

హైదరాబాద్,డిసెంబర్ 9 : వేములవాడ రాజన్న ఆలయ ఈవో వినోద్ రెడ్డి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఆగస్టు 12న 60 కోడెలను రాంబాబు అనే వ్యక్తికి ఆలయ ఈవో అప్పగించారు. మంత్రి మెప్పు కోసం నిబంధనలకు విరుద్ధంగా కోడెలను అప్పగించినట్లు తెలుస్తోంది. దీంతో మంత్రి కొండా సురేఖ సిఫార్సుతో రాజన్న ఆలయ కోడెలు పక్కదారి పట్టాయనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సిఫారసుతో తెచ్చిన 60 కోడెల్లో ప్రస్తుతం 11 మాత్రమే ఉన్నాయి. మిగిలిన వాటి గురించి ఆరాతీయగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సదరు గోశాల నిర్వాహకుడు వీటి రాజన్న కోడెల గురించి పొంతన లేని సమాధానాలు చెప్పడం అనుమానాలను పెంచుతోంది. గోశాల ముసుగులో గోవులను కబేళాలకు తరలిస్తున్నట్టు అతనిపై ఆరోపణలు వస్తున్నాయి. గీసుకొండ మండలం మనుగొండకు చెందిన మాదాసి రాంబాబుకు వేములవాడ రాజన్న ఆలయానికి చెందిన 60 కోడెలను ఇచ్చారు. కానీ.. అతను చెప్పిన గోశాలలో ప్రస్తుతం 11 మాత్రమే ఉన్నాయి. మిగతా గోవులను విక్రయించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఆయన గతేడాది ఫిబ్రవరి 1న తమ కుటుంబ సభ్యుల పేరుతో రాజేశ్వర సొసైటీని రిజిస్ట్రేషన్ చేయించినట్టు తెలుస్తోంది. గీసుకొండ మండలం గట్టుకిందిపల్లెలో డీబీఎం-38 సబ్ కెనాల్ పక్కన నాలుగు నెలల కిందట చిన్నపాక వేశారు. అందులోనే చిన్న గోశాల ఏర్పాటు చేశారు. తర్వాత వేములవాడ ఆలయం నుంచి 60 కోడెలను తీసుకొచ్చారు. అందులో 49 కోడెలను అమ్ముకున్నారని.. విశ్వ హిందూ పరిషత్ బాధ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం అనంతారం గ్రామంలో.. మంద స్వామి, రాంబాబు కలిసి ఐదేళ్ల కిందట హనుమాన్ గోశాలను నిర్వహించారు. పలు ఆలయాల నుంచి గోవులను తీసుకొచ్చి సంరక్షణ పేరిట వీరు కబేళాలకు విక్రయించినట్టు ఆరోపణలు ఉన్నాయి. కబేళాలకు అమ్ముతుండగా తాము అడ్డుకుని పోలీసులకు పట్టిచ్చినట్లు బీజేపీ నేతలు చెబుతున్నారు. ఈ వ్యవహారం బయటకు రావడంతో.. హనుమాన్ గోశాలను మూసివేశారు. మళ్లీ కొత్తగా గట్టుకిందిపల్లెలో గోశాల ఏర్పాటు చేసి.. దీని ద్వారా దందా కొనసాగిస్తున్నారని తెలుస్తోంది. తాను వేములవాడ నుంచి 60 కోడెలను తీసుకొచ్చింది వాస్తవమేనని గోశాల నిర్వాహకుడు రాంబాబు చెబుతున్నారు. కానీ.. ప్రస్తుతం తన వద్ద 11 ఉన్నాయని అంటున్నారు. తాను తీసుకొచ్చిన వాటిల్లో 26 కోడెలను తిరిగి వేములవాడలోని గోశాలలో అప్పగించానని చెబుతున్నారు. మిగతా వాటిల్లో కొన్ని చనిపోగా.. మరికొన్ని తీసుకొస్తుండగానే పారిపోయినట్లు వింత సమాధానాలు చెప్పారు. ఈ వ్యవహారం వివాదాస్పదంగా మారడంతో.. పోలీసులు దృష్టి సారించారు. 49 కోడెలను అమ్మేసినట్లు పోలీసుల విచారణలో తేలినట్లు తెలిసింది. దీనిపై విచారణ చేస్తున్నామని, రాంబాబు ఒక్కరికే 60 కోడెలను ఎలా ఇచ్చారనే విషయమై వేములవాడ ఈవోకు లెటర్ రాశామని పోలీసులు చెబుతున్నారు. ఈవో నుంచి రిప్లై వచ్చాక.. దాన్నిబట్టి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అయితే.. ఈ వ్యవహారంలో మంత్రి సురేఖ సిఫారసు లెటర్ కీలకంగా మారింది. మంత్రి రాంబాబుకు లెటర్ ఎందుకు ఇచ్చారనే చర్చ జరుగుతోంది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
10 డిసెంబర్
2024






# దేశాన్ని అస్థిరపర్చే కుట్ర!

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి సంబంధాలు ఉన్నాయని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ అంశంపై పార్లమెంటులో చర్చించాలనే డిమాండ్‌ను తెరపైకి తెచ్చింది. బీజేపీ ఆరోపణలపై సోమవారం రాజ్యసభలో గందరగోళం నెలకొంది. కేంద్ర మంత్రి జేపీ నడ్డాబీ రాజ్యసభలో ప్రతిపక్ష నేత ఖర్గే మధ్య మాటల యుద్ధం నడిచింది. కాంగ్రెస్ పార్టీ విదేశీ శక్తుల చేతుల్లో 'సాధనం'గా వ్యవహరిస్తోందని నడ్డా ఆరోపించారు. సోరోసతో కాంగ్రెసకు సంబంధాలు ఉన్నాయని, భారత్‌ను అస్థిరపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దీనిపై ఖర్గే తీవ్రంగా స్పందించారు. నడ్డా అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. సమస్యల నుంచి ప్రజల నుంచి దృష్టి మరల్చేందుకే బీజేపీ నిరాధార ఆరోపణలు చేస్తోందన్నారు. ఈ క్రమంలో నడ్డా, ఖర్గేలను తన చాంబర్‌కు రావాలని ధన్‌ఖడ్ ఆదేశించారు. విపక్ష పార్టీల ఎంపీలు తాము లేవనెత్తిన అంశాలపై చర్చించాలని పట్టుబట్టడంతో సభ వాయిదాల పర్వంలో నడిచింది. రెండోసారి వాయిదా అనంతరం సభ తిరిగి ప్రారంభమైన తర్వాత నడ్డా మాట్లాడుతూ.. ఫోరమ్ ఆఫ్ డెమోక్రటిక్ లీడర్స్ ఇన్ ఆసియా ఫసిఫిక్ ఫౌండేషన్‌కు సోరోస్ సంస్థ నిధులు సమకూరుస్తోందన్నారు. ఆ ఫౌండేషన్‌కు సోనియా సహ అధ్యక్షురాలిగా ఉన్నారని చెప్పారు. ఇది చాలా తీవ్రమైన అంశమన్నారు. 'ఇది భారతదేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తుంది. జాతీయ భద్రతపై ఆందోళనను పెంచుతోంది. దేశ భద్రతతో కాంగ్రెస్ ఆటలు ఆడుకుంటోంది. అందుకే ఈ అంశంపై చర్చించాలని కోరుకుంటున్నాం' అని పేర్కొన్నారు. దీంతో సోనియా, సోరోస్ సంస్థ సంబంధాలపై వెంటనే చర్చ చేపట్టాలని కోరుతూ బీజేపీ ఎంపీలు నినాదాలు చేశారు. బీజేపీ సభ్యుల డిమాండ్‌పై కాంగ్రెస్ ఎంపీలు ఖర్గే, జైరాం రమేశ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని లేవనెత్తేందుకు బీజేపీ ఎంపీలను ఎలా అనుమతించారని చైర్మన్‌ను అడిగారు. సభలో లేని వ్యక్తి గురించి మాట్లాడడం వారి ప్రతిష్ఠను దిగజార్చడమేనన్నారు. చైర్మన్ ధన్‌ఖడ్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రిజిజు మాట్లాడుతూ.. సోనియా-సోరోస్ మధ్య సంబంధాలు దేశ భద్రతకు ఆందోళనకరమన్నారు. కాగా,సభలో చైర్మన్ ధన్‌ఖడ్, కాంగ్రెస్ ఎంపీ జైరాంరమేశ్ మధ్య వాగ్వాదం జరిగింది. చైర్మన్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని రమేశ్ ఆరోపించారు. గందరగోళ పరిస్థితులతో చైర్మన్ సభను మంగళవారానికి వాయిదా వేశారు.

**లోక్‌సభలోనూ గందరగోళం..**

లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదానీ వ్యవహారంపై జేపీసీతో విచారణ జరపాలని, మణిపూర్ అంశం, శంభులో రైతులపై రబ్బర్ బుల్లెట్లతో దాడి వంటి అంశాలపై చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. విపక్ష సభ్యుల నినాదాలతో సభ కొద్దిసేపటికే వాయిదా పడింది. మళ్లీ సభ ప్రారంభం కాగానే విపక్షాలు నినాదాలతో హోరెత్తించాయి. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ తెలిపారు. మళ్లీ అదే పరిస్థితి ఉండడంతో 3 గంటలకు వాయిదా వేశారు. ఒకవైపు ప్రతిపక్షాల ఆందోళన జరుగుతుండగానే, మరోవైపు బీజేపీ ఎంపీలు సోనియా-సోరోస్ అంశంపై చర్చించాలని పట్టుబట్టారు. దీంతో స్పీకర్ సభను మంగళవారానికి వాయిదా వేశారు.

## రాహుల్ గాంధీకి అదానీ, మోదీ ఇంటర్వ్యూ!

***అదానీపై పార్లమెంటులో చర్చ కోసం కాంగ్రెస్ వినూత్న నిరసన ప్రదర్శన***



అదానీపై అమెరికా చేసిన అవినీతి ఆరోపణలపై పార్లమెంటులో చర్చ కోసం పట్టుబడుతున్న కాంగ్రెస్ పార్టీ సోమవారం వినూత్న రీతిలో నిరసన తెలిపింది. అదానీ, మోదీ మాస్కులు ధరించి పార్లమెంటుకు వచ్చిన కాంగ్రెస్ ఎంపీలు మాణిక్కం ఠాగూర్, సప్తగిరి శంకర్‌ను విపక్ష నేత రాహుల్‌గాంధీ ఇంటర్వ్యూ చేశారు. 'మీ ఇద్దరి మధ్య ఉన్న సంబంధం ఏంటి' అని వారిని ప్రశ్నించారు. దానికి.. 'ఏదైనా మేమిద్దరం కలిసే చేస్తాం. ఎన్నో ఏళ్ల బంధం మాది' అని బదులిచ్చారు. అదానీ మాస్కు వేసుకున్న ఠాగూర్.. 'నేనేది చెప్తే ఆయన అదే చేస్తారు. ఎయిర్‌పోర్టు అయినా పోర్టు అయినా.. ఏది అడిగితే అది ఇస్తారు' అని మోదీ మాస్కు వేసుకున్న శంకర్‌ను ఉద్దేశించి అన్నారు.

## చెన్నమనేని రమేశ్ జర్మన్ పౌరుడే..

**తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు**

**చెన్నమనేనికి రూ.30 లక్షల జరిమానా విధింపు**



హైదరాబాద్,డిసెంబర్ 9 : వేములవాడ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత చెన్నమనేని రమేశ్ కు తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. రమేశ్ జర్మన్ పౌరుడేనని హైకోర్టు నిర్ధారించింది. పౌరసత్వం కేసులో దాఖలైన పిటిషన్ ను హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ కు రూ. 30 లక్షల జరిమానా విధించింది. రూ. 25 లక్షలు ప్రస్తుత ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు చెల్లించాలని, మరో రూ. 5 లక్షలు హైకోర్టు న్యాయసేవాధికార సంస్థకు చెల్లించాలని ధర్మాసనం ఆదేశించింది. నెలలోపు జరిమానా చెల్లించాలని స్పష్టం చేసింది.చెన్నమనేని జర్మనీ పౌరుడిగా ఉంటూ ఎమ్మెల్యేగా గెలిచారని కోర్టు తీర్పు ఇచ్చింది. తప్పుడు పత్రాలతో గత 15 ఏళ్లుగా కోర్టును తప్పుదోవ పట్టించారని వ్యాఖ్యానించింది. తప్పుడు సమాచారంతో చెన్నమనేని రమేశ్ ఎన్నికల్లో పోటీ చేశారని కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న ఆది శ్రీనివాస్ గతంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రమేశ్ వేములవాడ నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు గెలుపొందారు. 2009లో తెలుగుదేశం పార్టీ నుంచి, ఆ తర్వాత ఉపఎన్నికతో కలిపి 2010 నుంచి 2018 వరకు మూడుసార్లు విజయం సాధించారు. చట్టం ప్రకారం భారతీయ పౌరులు కాని వారు ఎన్నికల్లో పోటీ చేసేందుకు లేదా ఓటు వేసేందుకు అవకాశం లేదు. మాజీ ఎమ్మెల్యే రమేశ్ జర్మన్ పాస్‌పోర్ట్‌ను కలిగి ఉన్నారని, అది 2023 వరకు చెల్లుబాటులో ఉందని 2020లో కేంద్రం తెలంగాణ హైకోర్టుకు తెలియజేసింది. అయితే రమేశ్ తన దరఖాస్తులో వాస్తవాలను దాచిపెట్టిన కారణంగా భారతీయ పౌరసత్వాన్ని రద్దు చేస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. రమేశ్ తప్పుడు పత్రాలతో భారత ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టించారని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ హైకోర్టుకు తెలిపింది. హోం మంత్రిత్వ శాఖ ఆదేశాలను సవాల్ చేస్తూ రమేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జర్మన్ పాస్‌పోర్ట్ సరెండర్‌కు సంబంధించిన వివరాలను, జర్మన్ పౌరసత్వాన్ని వదులుకున్నట్లు రుజువు చేస్తూ అఫిడవిట్‌ను దాఖలు చేయమని హైకోర్టు రమేశ్ ను ఆదేశించింది. ఈ కారణంతో 2013లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రమేశ్ ఉపఎన్నిక విజయాన్ని రద్దు చేసింది. దీంతో రమేశ్ సుప్రీం కోర్టును ఆశ్రయించి స్టే విధించింది. స్టే అమల్లో ఉండగానే 2014, 2018 ఎన్నికల్లో చెన్నమనేని ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు.

# ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా తెలంగాణ తల్లి

- తల్లికి కిరీటం ఉంటుందని ఎక్కడా చూడలేదు
- సమ్మక్క-సారలమ్మ, చాకలి ఐలమ్మల స్ఫూర్తి
- అందరితో చర్చించి.. తల్లి విగ్రహానికి రూపకల్పన
- ఇకనుంచి డిసెంబర్ 9ననే తెలంగాణ ఆవిర్భావం
- తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ 9న జరిగింది
- తెలంగాణ అంటే ఒక్క కుటుంబ వ్యవహారం కాదు
- తెలంగాణ కోసం ఎందరో పోరాటాలు..మరెందరో ఆత్మబలిదానాలు
- అసెంబ్లీలో కీలక ప్రకటన చేసిన సిఎం రేవంత్



హైదరాబాద్,డిసెంబర్9 : డిసెంబర్ 9 తెలంగాణకు పర్వదినం అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 2009లో అదే రోజు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ప్రకటన వచ్చిందని గుర్తు చేశారు. శాసనసభ సమావేశాల ప్రారంభంలో ఆయన సభలో తెలంగాణ ఏర్పాటు, తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుపై మాట్లాడారు. ఇక్కడి ప్రజల ఆకాంక్షను సోనియా గాంధీ నెరవేర్చారన్నారు. సోనియా లేకుంటే తెలంగాణ ఏర్పాటు అయ్యేదా అని అన్నారు. రాష్ట్ర ప్రజలు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేశారని చెప్పారు. 'నా తెలంగాణ.. కోటి రతనాల వీణ' అన్న దాశరథి మాటలు నిత్యసత్యమని పేర్కొన్నారు అందుకే ఇకముందు డిసెంబర్ 9న తెలంగాణ ఉత్సవాలు నిర్వహిస్తామని ప్రకటించారు. ప్రతి ఏడాది డిసెంబర్ 9న తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాలు నిర్వహిస్తాం' అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం అయ్యాయి. ఉదయం 10:30 గంటలకు శాసనసభ, శాసన మండలి ఉభయ సభలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు. తెలంగాణ తల్లిపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను గట్టిగా తిప్పి కొట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. 'తెలంగాణ తల్లి వేరు, దేవత వేరు. ఏ తల్లికి కిరీటం ఉండదు. దేవతలకు మాత్రమే కిరీటం ఉంటుంది..ప్రభుత్వం ఆవిష్కరిస్తున్నది తెలంగాణ తల్లి విగ్రహాన్ని. తెలంగాణ గ్రామ దేవత పోచమ్మకు కిరీటం ఉంటుందా. ఈ విషయాన్ని జనాలకు వివరించాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.అసెంబ్లీలో తెలంగాణ తల్లిపై చర్చకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదన చేశారు. తెలంగాణ తల్లి విగ్రహంపై అసెంబ్లీ వేదికగా సీఎం ప్రకటన చేశారు.'సంస్కృతికి ప్రతిరూపమే తెలంగాణ తల్లి. 4కోట్ల ప్రజలను ఏకం చేసి నడిపించిన తల్లి తెలంగాణ తల్లి. అలాంటి తల్లి రూపాలు ఇప్పటికే జన బాహుళ్యంలో ఉన్నాయి. వాటికి ఇప్పటికీ అధికారికంగా గుర్తింపు లేదు. మన సంప్రదాయాలు, సంస్కృతి ఉట్టి పడేలా తెలంగాణ తల్లిని రూపొందించాం. చరిత్రకు దర్పంగా పీఠాన్ని రూపొందించాం. తెలంగాణ తల్లిని ఈ రోజు సచివాలయంలో ఆవిష్కరిస్తున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.భూప్రపంచంలో ఏ జాతికైనా గుర్తింపు.. ఆ జాతి అస్తిత్వమే అని చెప్పారు. అస్తిత్వానికి మూలం సంస్కృతి.. సంస్కృతికి ప్రతిరూపమే తల్లి అని వివరించారు. 'స్వరాష్ట్ర పోరాట ప్రస్థానంలో సకల జనులను ఐక్యం చేసింది తెలంగాణ తల్లి అని,. తెలంగాణ జాతి భావనకు జీవం పోసింది. నిరంతరం చైతన్యపరిచి లక్ష్యసాధన వైపు నడిపిందని గుర్తు చేశారు. తెలంగాణ తల్లి స్వరూపానికి అధికారిక గుర్తింపు లేదు. ప్రజాపోరాటాలకు ఊపిరి పోసుకున్న మాతృమూర్తిని గౌరవించుకునేందుకు నిర్ణయించాం.సచివాలయ

ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ తల్లి అంటే భావన మాత్రమే కాదు.. 4 కోట్ల బిడ్డల భావోద్వేగం. ప్రజల మనోఫలకాల్లో నిలిచిన రూపాన్ని సచివాలయ ప్రాంగణంలో ఆవిష్కరించుకుంటున్నాం. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకుని విగ్రహానికి రూపకల్పన చేశాం అని తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుపై ప్రకటన చేశారు. తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పనలో సంప్రదాయం, సంస్కృతు లను పరిగణనలోకి తీసుకున్నాం. ప్రశాంత వదనంతో సంప్రదాయ కట్టుబొట్టుతో తీర్చిదిద్దాం. గుండుపూస లు, హారం, ముక్కుపుడకను పొందుపర్చాం. ఆకుపచ్చ చీర, కడియాలు, మెట్టెలతో పాటు చాకలి ఐలమ్మ, సమ్మక్క-సారక్క పోరాట స్ఫూర్తితో తెలంగాణ తల్లి రూపకల్పన చేశాం. సంప్రదాయ పంటలైన వరి, జొన్న, సజ్జలు, మొక్కజొన్నలు ఆ తల్లి చేతిలో కనిపించేలా ఏర్పాటు చేశాం. చరిత్రకు దర్పణంగా నిలుచున్న విగ్రహాన్ని రూపొందించాం. ఉద్యమాలు, ఆత్మ బలిదానాలకు సంకేతంగా పీఠంలో పిడికళ్లను పొందుపరిచాం' అని రేవంత్‌రెడ్డి వివరించారు. 'తెలంగాణ సమాజం ఆరు దశాబ్దాలు పోరాటం చేసింది. ఓయూ, కేయూ కీలక భూమిక పోషించాయి. సామాజిక బాధ్యతతో విద్యార్థులు ఉద్యమ బాట పట్టారు. శ్రీకాంతాచారి వంటి చాలా మంది విద్యార్థులు అమరులయ్యారు. ఉద్యమాన్ని గౌరవించి డిసెంబర్ 9న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఏర్పాటు ప్రకటన చేసింది. అందుకే ప్రతి ఏడాది డిసెంబర్ 9న తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాలు నిర్వహిస్తాం' అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. తెలంగాణ ప్రతిరూపమే అధికారికంగా లేదు. అందరితో చర్చించి తెలంగాణ తల్లి రూపంపై నిర్ణయం తీసుకున్నాం. దేవతలా ఉండాలా లేక మన ఇంట్లో తల్లిలా ఉండాలా అనే చర్చ జరిగింది. తల్లి ప్రతిరూపమే పెట్టుకోవాలనే అభిప్రాయం వచ్చింది. అందుకే ఈ రోజు బహుజన తల్లిని ఆవిష్కరిస్తున్నాం. కొందరికి ఇది నచ్చలేదు. ఒక కుటంబం, ఒక వ్యక్తి తెలంగాణ అనే భావన మంచిది కాదు. ఈ ఒక్కరోజు రాజకీయాలు పక్కన పెడదాం. రేపటి నుంచి రాజకీయ అంశాలు ప్రస్తావిద్దాం. సాయంత్రం 6గంటల ప్రాంతంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు బీఆర్ఎస్ అధినేత,. మాజీ సీఎం కేసీఆర్, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, కమ్యూనిస్టు నేతలను ఆహ్వానిస్తున్నాం. అందరూ విగ్రహావిష్కరణకు హాజరు కావాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

## తెలంగాణలో పౌరసేవలు మరింత సులభతరం

**సరికొత్త మొబైల్ యాప్ ను అందుబాటులోకి**

**యాప్ ద్వారా పౌరులకు సేవలను మరింత చేరువ**

హైదరాబాద్,డిసెంబర్ 9 : తెలంగాణ ప్రజలు ఇంటి నుంచే పౌరసేవలు పొందేందుకు వీలుగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం ప్రత్యేకంగా మీసేవ యాప్‌ను ఐటీశాఖ సిద్ధం చేసింది. ఈ యాప్ ద్వారా దాదాపు 150 రకాల పౌర సేవలను పొందవచ్చు. హైదరాబాద్ మెట్రో స్టేషన్లు, షాపింగ్ మాల్స్, కలెక్టరేట్లు వంటి రద్దీ ప్రాంతాల్లో ఇంటరాక్టివ్ కియోస్క్ ద్వారా కూడా ప్రజలు పౌర సేవలు పొందవచ్చు. డిజిటల్ చెల్లింపులు, అప్లికేషన్లు, సర్టిఫికెట్‌లు ప్రింట్ తీసుకునే అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తోంది. మీసేవలో తెలంగాణ ప్రభుత్వం కొత్త సర్వీసులను చేర్చింది. దివ్యాంగుల గుర్తింపు కార్డులు, వృద్ధుల సంక్షేమ కేసుల పర్యవేక్షణ, సదరం సర్టిఫికెట్ల జారీ, టూరిజం హోటల్స్, ప్యాకేజీల బుకింగ్, పర్మిట్ల రెన్యూవల్, కొత్తవి జారీ చేయటం, వాల్టా చట్టం కింద చెట్ల తొలగింపు, తరలించేందుకు అనుమతులకు సంబంధించిన సర్వీసులను మీసేవలో చేర్చింది. ఈ నిర్ణయంతో ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే బాధ తప్పింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ విప్లవానికి రేవంత్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రూ.300కే ఇంటర్‌నెట్ కనెక్షన్ అందుబాటులోకి తీసుకురానుంది. లక్షల ఇళ్లకు దశలవారీగా ప్రభుత్వం ఇంటర్ నెట్ సౌకర్యం కల్పించనుంది. ఈ కనెక్షన్ తీసుకుంటే వర్చువల్ నెట్‌వర్క్‌తో పాటు.. టెలిఫోన్, తెలుగు ఓటీటీలను ప్రజలు చూడటానికి వీలుంటుంది. మొదటి దశలో నారాయణపేట, సంగారెడ్డి, పెద్దపల్లి జిల్లాల్లోని 2,096 పంచాయతీల్లో దీన్ని అమలు చేయనున్నారు. ఈ కనెక్షన్ తీసుకుంటే ప్రతి ఇంట్లో ఉన్న టీవీనే కంప్యూటర్‌గా మారుతుందని అధికారులు చెబుతున్నారు. 20 ఎంబీపీఎస్ స్పీడ్‌తో కనెక్షన్ ఇస్తారని చెబుతున్నారు. ఈ కనెక్షన్ ద్వారా చెల్లింపులు కూడా చేయవచ్చని.. గ్రామంలోని అన్ని కార్యాలయాలకు, స్కూళ్లకు కూడా కనెక్షన్ ఇవ్వనున్నట్టు అధికారులు వివరిస్తున్నారు. టీవీనే కంప్యూటర్‌గా మారుతుంది కాబట్టి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే అవకాశముంది. ఈ కనెక్షన్ తీసుకునేవారితో హైదరాబాద్ నుంచే ముఖ్యమంత్రి నేరుగా మాట్లాడే వీలు కలుగుతుందని.. అధికారులు చెబుతున్నారు. ప్రతి గ్రామంలోనూ జంక్షన్లు, ఇతర చోట్ల కూడా అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి.. ఫైబర్ నెట్‌తో అనుసంధానం చేయబోతున్నారు. ఇవి ప్రతి పోలీస్ స్టేషన్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానమవుతాయని అధికారులు వివరిస్తున్నారు.

## స్వలాభం కోసం తెలంగాణ తల్లి రూపురేఖల్ని మార్చడం బాధాకరం

**రేవంత్ దుశ్చర్యకు తెలంగాణ కన్నీళ్లు**

**ఉద్యమతల్లిని కాంగ్రెస్ తల్లిగా మార్చారు : ఎమ్మెల్సీ కవిత**



హైదరాబాద్, డిసెంబర్9 : తెలంగాణ తల్లి రూపురేఖల్ని మార్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించడం దురదృష్టకరమన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ దుశ్చర్యకు తెలంగాణ తల్లి కన్నీళ్లు పెడుతుందని తెలిపారు. ఉద్యమ తల్లిని నేడు కాంగ్రెస్ తల్లిగా మార్చారని విమర్శించారు. రాజీవ్ గాంధీ విగ్రహాన్ని రహదారిలో ఏర్పాటు చేసి.. తెలంగాణ తల్లి అని చెబుతున్న విగ్రహాన్ని చెరసాలలో ఏర్పాటు చేస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ తల్లిని తాము తిరస్కరిస్తున్నామని వెల్లడించారు. కోట్లాది మంది తెలంగాణ బిడ్డల్లో స్ఫూర్తి నింపిన తెలంగాణ తల్లి రూపురేఖలను మార్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బతుకమ్మతో పువ్వులను పూజించే సంస్కృతి తెలంగాణలో తప్ప ప్రపంచంలో మరెక్కడా లేదని తెలిపారు. తెలంగాణ తల్లి నుంచి బతుకమ్మను దూరం చేశారని మండిపడ్డారు. బతుకమ్మను మాయం చేయడం దురదృష్టకరమని చెప్పారు. బతుకును ఆగం చేశారని, బతుకమ్మను మాయం చేశారని ధ్వజమెత్తారు. తెలంగాణ తల్లికి నివాళులు అర్పించాలి అనుకుంటే గన్ పార్క్ దగ్గర ముక్కు నెలకు రాయాలన్నారు. ఉద్యమకారులపై తుపాకీ ఎక్కు పెట్టినందుకు తెలంగాణ తల్లికి నివాళులర్పించే హక్కు సీఎం రేవంత్ రెడ్డికి లేదని చెప్పారు.

## ఐసిస్ శిబిరాలపై అమెరికా దాడులు

మొదటి పేజీ తరువాయి

సిరియాలో అనూహ్యమైన పరిస్థితులు చోటుచేసుకుంటున్నాయి. తిరుగుబాటు దళాలు రాజధాని డమాస్కస్ నగరాన్ని స్వాధీనం చేసుకోవడంతో ఆ దేశ అధ్యక్షుడు బషర్ అల్ అస్సాద్ కుటుంబాన్ని తీసుకొని రష్యాకు పారిపోయినట్టుగా కథనాలు వెలువడుతున్నాయి. దీంతో దశాబ్దాలుగా కొనసాగుతున్న అస్సాద్ పాలనకు ముగింపు పడింది. కాగా సిరియాలో అంతర్యుద్ధం పరిస్థితులను అదునుగా భావించిన అగ్రరాజ్యం అమెరికా ఉగ్రవాద సంస్థ ఐసిస్ స్థావరాలపై దాడులు మొదలు పెట్టింది. అస్సాద్ రష్యాకు పారిపోయిన కొన్ని గంటల వ్యవధిలోనే ఐసిస్ లక్ష్యాలపై ఆదివారం డజన్ల కొద్దీ దాడులు చేసింది. దేశంలో నెలకొన్న అంతర్యుద్ధ పరిస్థితులను అవకాశంగా మలచుకొని తిరిగి బలపడాలని ఐసిస్ చూస్తోందని, తాము అలా జరగనివ్వబోమని, 'స్పష్టమైన ఆలోచన'తో ఐసిస్ లక్ష్యాలపై దాడులు జరిపామని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించారు. ఈ మేరకు అధ్యక్ష భవనం నుంచి ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాగా ఐసిస్ స్థావరాలపై ఆదివారం దాడులు జరిపామని, తమ యుద్ధ విమానాలు డజన్ల కొద్దీ శిబిరాలను తాకాయని యూఎస్ మిలిటరీ నిర్ధారించింది. బీ-52, ఎఫ్-15, ఏ-10తో పాటు యూఎస్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన విమానాలను ఉపయోగించి సెంట్రల్ సిరియాలోని 75కు పైగా లక్ష్యాలపై దాడులు చేశామని అధికారిక ప్రకటనలో పేర్కొంది. కాగా సిరియాలో అధ్యక్షుడు అస్సాద్ పాలన పతనమవ్వడం న్యాయమేనని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వ్యాఖ్యానించారు. దీర్ఘకాలంగా బాధపడుతున్న సిరియా ప్రజలకు ఇది చారిత్రాత్మక అవకాశమని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు బషర్ అల్ అస్సాద్, అతడి కుటుంబం రష్యా పారిపోయి అక్కడ ఆశ్రయం పొందినట్లు కథనాలు వెలువడుతున్నాయి. కాగా గత ఐదు దశాబ్దాలుగా కొనసాగుతున్న అస్సాద్ కుటుంబ పాలనపై ఇస్లామిస్ట్ హయత్ తహ్రీర్ అల్ షామ్ (హెచ్‌టీఎస్) అనే గ్రూపు మెరుపు దాడికి తెగబడింది. అమెరికా మద్దతున్న ఈ గ్రూపు దళాలు 11 రోజుల్లోనే సిరియాను తమ అధీనంలోకి తెచ్చుకున్నాయి. మరోవైపు పశ్చిమాసియాలో ఎప్పటి నుంచో సంక్షుభిత పరిస్థితులు ఉన్న దేశాల్లో సిరియా ఒకటి. సుదీర్ఘకాలంగా ఇక్కడ అంతర్యుద్ధం నడుస్తోంది. తిరుగుబాటుదారులకు భయపడి దేశాధ్యక్షుడు బషర్ అల్ అసద్ దేశం విడిచి రష్యాకు పారిపోవడం సిరియాలో నెలకొన్న సంక్షోభానికి పరాకాష్ఠ. అంతర్జాతీయ సమాజం సిరియా పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తోంది. తాజాగా, సిరియా అంశంపై భారత కేంద్ర ప్రభుత్వం స్పందించింది. సిరియాలో జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. సిరియాలో మళ్లీ స్థిరత్వం నెలకొనాలని కోరుకుంటున్నామని ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. సిరియా సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత, ఐక్యతను పరిరక్షించుకునేందుకు అక్కడి అన్ని పార్టీలు కలసికట్టుగా పనిచేయాలని సూచించింది. అంతిమంగా సిరియా ప్రజల మనోభావాలకు అనుగుణంగా శాంతిస్థాపన జరగాలని, ఆ మేరకు రాజకీయ ప్రక్రియ ఉండాలని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. ఇక, సిరియాలో ఉన్న భారత పౌరుల భద్రత కోసం, రాజధాని డమాస్కస్ నగరంలోని భారత దౌత్య కార్యాలయాన్ని అన్ని వేళలా తెరిచి ఉంచుతున్నట్టు ఆ ప్రకటనలో వెల్లడించింది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
10 డిసెంబర్
2024



# సోనియాజీ రాష్ట్రం ఇచ్చారు... థాంక్స్

## అసెంబ్లీలో ఆలేరు ఎమ్మెల్యే ఐలయ్య

హైదరాబాద్, రోమింగ్ న్యూస్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల ఐలయ్య అసెంబ్లీ సెషన్ మొదటి రోజు తెలంగాణ రాష్ట్రంలోని 4కోట్ల ప్రజల కలను సాకారం చేసిన సోనియాగాంధీ జన్మదిన సందర్భంగా, అదేవిధంగా తెలంగాణ విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసి ప్రారంభిస్తున్న సందర్భంగా మాట్లాడారు. ఈరోజు ఒక శుభదినం డిసెంబర్ 9 అంటేనే తెలంగాణ రాష్ట్రంలో నాలుగు కోట్ల మంది ఆకాంక్ష నెరవేరిన రోజు 60 సంవత్సరాల పోరాటం 60 సంవత్సరాల నాలుగు కోట్ల ప్రజల కలను నెరవేర్చినటువంటి సోనియమ్మ జన్మదినం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆలేరు నియోజకవర్గం ప్రజల తరఫున సోనియమ్మకు ప్రత్యేక ధన్యవాదాలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.మన తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర గీతాన్ని అధికారికంగా చేసుకొని అదేవిధంగా తెలంగాణ తల్లిని కూడా రూపొందించుకోవడం జరిగింది.

తెలంగాణ తల్లి విగ్రహం అనేది నాలుకోట్ల ప్రజల గుండెల్లో, ప్రజల ఇళ్లల్లో ఉండే విధంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు మంత్రివర్గమంతా కూడా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించుకోవడం జరిగిందన్నారు. ఆఇప్పుడు రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహం పిల్లలకు అభయహస్తం ఇస్తూ ఈ రాష్ట్రాన్ని ఆర్థికంగా రాజకీయంగా



సామాజికంగా అన్ని విధాలుగా పాడి పంటలు ఓ చేయితో అభయ హస్తం ఇస్తూ ఒకవైపు మొక్కజొన్న కంకి,జొన్న,పాడి పంటలు ఇప్పుడు పండుతున్న వడ్లకు,ఓ తల్లికి,ఓ చెల్లికి ప్రతిరూపకంగా ఈ విగ్రహం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాంటి ఆ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఈరోజు సాయంత్రం 6 గంటలకు ప్రారంభించుకోవడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. గత ప్రభుత్వాలు తెలంగాణ తల్లిని తెలంగాణ రాష్ట్ర గీతాన్ని విస్మరించాయన్నారు.ఇప్పుడు రూపొందించిన తెలంగాణ తల్లి పై కూడా ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నారని వారికి ప్రజలు బుద్ధి చెప్పిన ఇంకా బుద్ధి రావడం లేదన్నారు.తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ గారి దయ దక్షిణాల మీద అధికారంలోకి వచ్చి ఈరోజు సోనియమ్మ జన్మదిన పుట్టినరోజులు సందర్భంగా అసెంబ్లీ రాకపోవడం నిజంగా కూడా ఇది దురదృష్టకరమన్నారు.

గత ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్రం సోనియా గాంధీ వల్లనే వచ్చిందని గత ముఖ్యమంత్రి కెసిఆర్ గారు మాట్లాడి ఇప్పుడు సభకు రాకపోవడం తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారన్నారు.

ఈరోజు సాయంత్రం 6 గంటలకు తెలంగాణ తల్లి విగ్రహ ప్రారంభోత్సవానికి పెద్ద ఎత్తున హాజరై ధన్యవాదాలు తెలియజేయాలని కోరారు. అన్నారు. తెలంగాణ తల్లి దయవల్ల తెలంగాణ రాష్ట్రంలో పాడిపంటలు అభివృద్ధి జరగాలని కోరుకున్నారు. గత పది సంవత్సరాలు చేయని అభివృద్ధి ఒక సంవత్సరంలో చేసి చూపెట్టిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రికి,మంత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# గుట్టలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలు





యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కానుగు బాలరాజు గౌడ్, టౌన్ అధ్యక్షులు బందారపు బిక్షపతి గౌడ్, మున్సిపల్ చైర్మన్ సుధాహేమేందర్ గౌడ్, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు నరసింహా గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుండ్లపల్లి భరత్ గౌడ్, కౌన్సిలర్ ముక్కర్ల మల్లేష్ యాదవ్, కలకుంట్ల బాల నరసయ్య గౌడ్, సుడుగు జీవన్ రెడ్డి సుడిగు శ్రీనివాస్ రెడ్డి,కలకుంట్ల బాల్ నర్సయ్య, బూడిద భాస్కర్, సోషల్ మీడియా కన్వీనర్ గుడ్ల నరేష్ కుమార్ బరిగే రామచందర్, గౌలికర్ రాజేష్ పల్లె పార్టీ మహేష్, పల్లెపాటి శ్రీను, బలరాం, మొలుగు నరసింహ, సంజీవ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొనడం జరిగింది.

# ఓక్ వుడ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు




హైదరాబాద్, రోమింగ్ న్యూస్: ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ లక్ష్మారెడ్డి, వైస్ చైర్మన్, విద్యారత్న, గ్రీన్ అంబాసిడర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి లకు స్కూల్ ఎక్సలెన్స్ అవార్డులను దక్కించుకున్నారు. కేంద్ర గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, ట్రస్మా రాష్ట్ర శాఖ అధ్యక్షులు సాదుల మధుసూదన్ ల చేతుల మీదుగా వారు ఈ అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా దిల్సుక్ నగర్ నెలకొల్పిన ఇంటర్నేషనల్ స్కూల్ తన లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగుతున్నదని చెప్పారు. తల్లిదండ్రుల ప్రేమ ఆదరాభిమానాలను అందుకుంటూ సక్సెస్ఫుల్ స్కూల్ గా ముందుకు సాగడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

# ఉచిత వైద్య శిబిరంతో పేదలకు మేలు: కత్తుల సుదర్శన్



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: అఖిల భారత పద్మశాలి అన్నసత్రం యాదగిరిగుట్ట ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారని ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ తెలిపారు. కామినేని అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ మరియు రీసెర్చ్ సెంటర్ ఎల్బీనగర్ వారి వైద్య బృందంచే పరీక్షలు నిర్వహించారు, 130 మంది పరీక్షలు చేసుకున్నారు. అధ్యక్షులు బిపి, షుగర్ పరీక్షలు మరియు అవరం ఉన్నా వారికి ఉచితముగా మందులు అందజేశారు. కత్తుల సుదర్శన్,కార్యాధ్యక్షులు డీకొండ జోగయ్య, ప్రధాన కార్యదర్శులు రచ్చ శ్రీనివాస్ చిక్కా దేవదాసు, పర్యవేక్షకులు మంగలంపల్లి బాలకృష్ణ, ఉపాధ్యక్షులు చుంచు నాగ భూషణం కోమటి సత్యనారాయణ, కోశాధికారి బడుగు మల్లేశం, రాష్ట్ర పురోహిత సంఘం అధ్యక్షుడు రుద్ర పాండురంగ శాస్త్రి, పాశికంటి నాగమూర్తి,కోడూరు రాజు, పట్టణ అధ్యక్షుడు యెర్రగుంట వెంకటేష్ ,ధర్మకర్తలు మార్గం యాదగిరి, మిర్యాల లక్ష్మీ, కైరంకొండ సుదీర్,బొమ్మ సూర్యనారాయణ, లక్ష్మి నారాయణ, బొగ పురుషోత్తం,డీకొండ వెంకటేష్, ఎర్రగుంట్ల శేఖర్, మెరుగు మదు ,అంకం రాజు,అంకం సత్తయ్య, భాగ్యలక్ష్మి, సత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థులలో నైపుణ్యాన్ని పెంచండి



**జనగామ జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్**

**విద్యార్థులను ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన**



జనగామ,డిసెంబర్ 9: (రోమింగ్ న్యూస్) : ప్రతి విద్యార్థిలో ఏదో ఒక విశేషత ఉంటుందని దాన్ని గుర్తించి విద్యార్థులలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయాలని జనగాం జిల్లా అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. జనగామ జిల్లాకేంద్రంలోని సెయింట్ పాల్స్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను (ఇన్ స్పైర్ 2024-25) మున్సిపల్ ఛైర్పర్సన్ పోకల జమున, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మారుజోడు రాంబాబు, ఇన్ స్పైర్ పరిశీలకులు పింటు హతి, పాఠశాల ప్రిన్సిపాల్ జోసెఫ్ మారియా, విద్యా శాఖ అధికారి రమేష్ లతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రారంభించారు. ఈ సంధర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ తరగతి గదిలోనే భావిభారత శాస్త్రవేత్తలు తయారవుతారని, కావున ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించి వారిలో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయాలని కోరారు. రానున్న రోజుల్లో జనగామ ప్రాంతం శాస్త్రవేత్తల నిలయంగా మారాలని మున్సిపల్ ఛైర్పర్సన్ శ్రీమతి పోకల జమున ఆకాంక్షించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పిల్లలను ప్రోత్సహించడం, వారు బాధ్యతాయుతమైన పౌరులుగా మారడంలో సహాయపడటం మన అందరి కర్తవ్యమని, ప్రభుత్వం ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి, విద్యార్థులకు గుణాత్మక విద్య అందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా మార్చేందుకు ఈ వైజ్ఞానిక ప్రదర్శన ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా విద్యా శాఖ అధికారి రమేష్ తెలిపారు. విద్యార్థులను ఆకట్టుకున్న ఈ వైజ్ఞానిక ప్రదర్శన లో జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు తయారు చేసిన (265) ప్రయోగాలను ప్రదర్శించారు. విద్యార్థిని, విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యం పెంపొందించడంతో పాటు సమాజానికి ఉపయోగపడే ఎన్నో ప్రదర్శనలు ఏర్పాటు చేసేలా విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఉపేందర్, డీసీఈబీ కార్యదర్శి చంద్రభాను, ఏసీజీఈ టి. రవికుమార్, జిల్లా సమగ్ర శిక్ష కో-ఆర్డినేటర్లు బొమ్మనబోయిన శ్రీనివాస్, తోట రాజు, నరసింహ రావు, స్థానిక మండల విద్యా శాఖ అధికారి వంగాల రాజేందర్, రఘునంధన్ రెడ్డి, కళావతి, పి. రమేష్, ఎం. మల్లికార్జున్, రాజేందర్, శోభన్ బాబులు పాల్గొన్నారు.

# మండలాపురంలో ఉచిత వైద్య శిబిరం

**ప్రారంభించిన తీగల జాన్ శాస్త్రి**




నకిరేకల్ : నకిరేకల్ మండలం మండలాపురం గ్రామంలో బిలీవర్స్ ఈస్ట్రన్ చర్చి ఆధ్వర్యంలో ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ వారి సహకారంతో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు జిల్లా పరిషత్తు కోఆప్షన్ మాజీ సభ్యుడు తీగల జాన్ శాస్త్రి ప్రారంభించి మాట్లాడారు గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే ఈ ఉచిత వైద్య సేవలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు . శిబిరంలో డాక్టర్లు కరిష్మ భరత్ మనోజ్ఞ సంపత్ వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో క్యాంపు కోఆర్డినేటర్ జంగ జయరాజు మాజీ సర్పంచ్ దండి నాగేశ్వరరావు పాస్టర్లు వీసం ప్రేమ్ రాజ్, తీగల ఏసురత్నం నిర్వహణ కమిటీ వారు తీగల జనార్ధన్ తీగల శోభన్ ఆనందు గోపి నవీన్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు

# మళ్లీ రాజ్యసభకు ఆర్.కృష్ణయ్య

**రాజ్యసభకు నామినేటెడ్ చేసిన బీజేపీ పార్టీ**

హైదరాబాద్, డిసెంబర్9 : బీసీ ఉద్యమ నాయకుడు ఆర్ కృష్ణయ్యకు మళ్లీ రాజ్యసభ పదవి వరించింది. భారతీయ జనతా పార్టీ ఆర్ కృష్ణయ్యను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి రాజ్యసభకు నామినేట్ చేసింది. ఈ క్రమంలో ఆర్ కృష్ణయ్య మంగళవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. మళ్లీ రాజ్యసభ పదవి వరించడంతో ఆర్ కృష్ణయ్యకు బీసీ సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. వైసీపీ నుంచి రాజ్యసభకు ఎన్నికైన కృష్ణయ్య తన పదవీకాలం మరో నాలుగేండ్లపాటు ఉండగానే తన పదవికి ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఇక 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్బీ నగర్ నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున పోటీ చేసి గెలుపొందారు. అనేక బీసీ ఉద్యమాలకు నాయకత్వం వహించారు. బీసీల రిజర్వేషన్లు, వారి అభివృద్ధి కోసం అనేక పోరాటాలు నిర్వహించారు.

# ఎంత మందని కనాలో కూడా మీరే నిర్ణయిస్తారా?

ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం? నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణ త్వం? నరజాతి చరిత్ర సమస్తం రణరక్త ప్రవాహసిక్తం' అన్నారు మహాకవి శ్రీశ్రీ. రక్తం ఏరులైపారు తున్నా, బాంబులకు శరీరాలు శకలాలుగా మారుతున్నా? ఆగని హక్కుల పోరాటం. కొండలు గుట్ట ల్లోని విలువైన ఖనిజాల కోసం హక్కుల హననం ఒకవైపు, మతం పేరుతో మైనార్టీల హక్కులపై నిరంతర దాడి మరోవైపు? యధేచ్ఛగా సాగిపోతోంది. గాజా నుంచి మణిపూర్ వరకూ సాగుతోన్న మారణహోమం మనకిదే గుర్తు చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా నేడు మానవ హక్కులపై దాడి జరుగుతోంది. జాతి, వర్ణ, లింగ, కుల, మత, రాజకీయ వివక్షలకు గురవుతూనే వున్నారు. యుద్ధం జరుగుతున్న ప్రతిచోటా మొదటి బాధితులు బాలలు, మహిళలే. ఎవరినీ చిత్ర హింసలకు గురిచేయరాదు. ఎవరినీ క్రూరమైన, అమానవీయమైన, అవమానకరమైన శిక్షకు గురిచేయరాదని ఐక్యరాజ్య సమితి రూపొందించిన మానవ హక్కుల పత్రం స్పష్టం చేస్తోంది. అందరి హక్కులు కాపాడతామని ఐరాస సభ్యదేశాలు సంకల్పం తీసుకున్నాయి. గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తోన్న జాతి హననంపై ఐక్యరాజ్యసమితితో పాటు మానవహక్కుల సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా? మానవ హక్కుల పరిరక్షకులుగా ఫోజు పెట్టే అమెరికా కానీ, ఇతర పశ్చిమ దేశాలు కానీ ప్లలెత్తు మాట అనడంలేదు. మరోవైపు, మణిపూర్ తగలబడుతోంటే భారత్‌లో ప్రజాస్వామ్యం విలసిల్లుతోందని గొప్పలు చెప్పుకుంటూ విదేశీ పర్యటనల్లో మునిగితేలుతున్నారు ప్రధాని నరేంద్రమోడీ. ప్రపంచంలోనే అతి పెద్ద జనాభా కలిగిన భారత్ ఇప్పటికే ఆహార అభద్రత, పర్యావరణం, నిరుద్యోగం, పిల్లల్లో రక్తహీనత వంటి అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటే, ఇది చాలదన్నట్లు? ఇకనుంచి కొత్త జంటలు కనీసం ముగ్గురు పిల్లలను కనాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పిలుపునిచ్చారు.. అస్సాంలో బీఫ్ తినడంపై నిషేధం విధించింది అక్కడి బిజెపి ప్రభుత్వం. వాస్తవానికి అక్కడ బీఫ్ తినడం నిషేధం కాదు. ఉత్తరప్రదేశ్‌లో ఒక హిందువు ఇంటిని ఓ ముస్లిం డాక్టర్ కొనుక్కున్నాడని నానాయాగీ చేసి, ఆ ఇంటిని తిరిగి ఇప్పించేశారు. దేశంలో ప్రతిరోజూ? ప్రతిచోటా హక్కుల ఉల్లంఘన సాగిపోతూనే వుంది. ప్రజలు ఏమి తినాలో, ఏమి ధరించాలో, ఏ యిల్లు కొనుగోలు చేయాలో? చివరకు ఎంతమంది బిడ్డలను కనాలో కూడా వారే నిర్ణయించేస్తూ? హక్కులను పాతరేస్తున్నారు. 'మన పోరాటం డబ్బుకోసం కాదు, అధికారంకోసం కాదు? స్వేచ్ఛ, మానవత్వ పునరుద్ధరణలే మన లక్ష్యాలు' అంటారు అంబేద్కర్. సృష్టిలోని ప్రతి వ్యక్తికీ హక్కులుంటాయి. ఒక వ్యక్తి అభివృద్ధి సాధించాలంటే, ఆహారం, విద్య, వైద్యం, నైపుణ్యం, స్వేచ్ఛ వంటి సదుపాయాలతో పాటు ముఖ్యంగా జీవించే హక్కు ప్రతి ఒక్కరికీ వుంటుంది. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం వంటి మానవీయ విలువలను సమర్థించే ప్రజాస్వామ్య వ్యవస్థలో కనుమరుగవుతున్న ఈ హక్కుల కోసం పోరాటం చేయాల్సివస్తోంది. సమానత్వం, భావప్రకటన, వ్యక్తి స్వేచ్ఛ, మత స్వేచ్ఛ వంటివి రాజ్యాంగం ఈ దేశ పౌరులకు ప్రసాదించిన హక్కులు. ఒక వ్యక్తి హుందాగా, స్వేచ్ఛగా బతకడానికి అవి కనీసావసరం. ఇవి ప్రజాస్వామ్య వ్యవస్థలో అంతర్భాగం. అణచివేతలేని సమాజ నిర్మాణం కోసం నిరంతరం సాగించే కృషికి గుర్తుగా ప్రతి యేడాది డిసెంబర్ 10ని 'మానవహక్కుల దినోత్సవం'గా ప్రపంచమంతా పాటిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనల నుంచి, విధ్వంసం నుంచి కాపాడేందుకు అంతర్జాతీయ సమాజం మేల్కొనాలి.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
10 డిసెంబర్
2024





# కోఠి డీఎంఈ కార్యాలయం ముందు ఆశా వర్కర్ల ఆందోళన

**18000 ఫిక్స్‌డ్ జీతాలు ఇవ్వాలని డిమాండ్**

**కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీసులు**

**ఆశా వర్కర్లపై చేయి చేసుకున్న పోలీసులు**

**ఇద్దరు ఆశా వర్కర్ల పరిస్థితి విషమం**

**ఆశా వర్కర్లపై దాడిని ఖండించిన హరీశ్‌రావు**

**మాతృమూర్తులపై మగ పోలీసులతో దౌర్జన్యామా..?**

**సీఎం రేవంత్‌పై నిప్పులు చెరిగిన కేటీఆర్**



హైదరాబాద్,డిసెంబర్ 9 : సీఎం రేవంత్ రెడ్డి ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీ ప్రకారం రూ.18000 ఫిక్స్‌డ్ జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కోఠి డీఎంఈ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో పోలీసులు వారిని అరెస్టు చేసేందుకు యత్నించారు. దీంతో ఆశా వర్కర్లకు పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసు జులుం నశించాలంటూ పెద్ద ఎత్తున ఆశావర్కర్లు నినాదాలు చేశారు. ఇక ఆశావర్కర్లకు మద్దతు నిలిచిన బీఆర్ఎస్ కార్యకర్తలను కూడా పోలీసులు అరెస్టు చేశారు. కార్యాలయం వద్ద పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లపై పోలీసులు చేయి చేసుకున్నారు. ఎగిరెగిరి ఓ ఆశా వర్కర్‌ను మహిళా పోలీసులు కొట్టారు. బాధిత ఆశా వర్కర్ ఆ దెబ్బలకు తాళలేక తల్లడిల్లిపోయింది. ఆమెను పోలీసులు అసభ్యకర పదజాలంతో దూషించారు. ద్దరు ఆశా వర్కర్లు సొమ్మసిల్లి పడిపోయారు. ఆ ఇద్దరిని పోలీసులు పట్టించుకోలేదు. చివరకు మిగతా ఆశా కార్యకర్తలు వారిద్దరిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. సంతోష అనే ఆశా వర్కర్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, వారికి వైద్యం అందిస్తున్నామని ఉస్మానియా డాక్టర్లు పేర్కొన్నారు. ఉస్మానియాలో చికిత్స పొందుతున్న ఆశా వర్కర్లను బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌తో పాటు పలువురు పరామర్శించారు. ఆశా వర్కర్ల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను బీఆర్ఎస్ నేతలు ఆదేశించారు. ఇక ఆశా వర్కర్ల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పోలీసుల తీరును బీఆర్ఎస్ నేతలు ఖండించారు. ఏసీపీ, సీఐపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు.ఒకవైపు తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు చేస్తున్నమని గొప్పలు చెబుతూ, మరో వైపు క్షేత్రస్థాయిలో విశిష్ట సేవలందించే ఆశా తల్లులపై దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆశా వర్కర్ల వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పిస్తామని అభయహస్తం మేనిఫెస్టో పేజీ నెంబర్ 26లో హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీ అమలు చేయాలంటూ ఆశా అక్కా చెల్లెళ్లు రోడ్డెక్కితే పోలీసులతో ఇష్టారీతిన కొట్టించడం దుర్మార్గం అని హరీశ్‌రావు మండిపడ్డారు. ఇందిరమ్మ రాజ్యంలో ఆడబిడ్డలకు సేవలందించే ఆశా వర్కర్లకు నిరసించే హక్కు లేదా? సమస్యలు పరిష్కరించాలని అడిగే స్వేచ్ఛ లేదా? తెలంగాణ ఏర్పాటుకు మందు ఆశాల గౌరవ వేతనం రూ. 1500 మాత్రమే ఉంటే, కేసీఆర్ రూ. 10 వేలకు పెంచి వారి సేవలను గుర్తించారు, వారిని గౌరవించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది గడుస్తున్నా ఇచ్చిన హామీ నెరవేర్చలేదు. ప్రశ్నిస్తే పోలీసులతో పళ్లూడగొట్టించే దుర్మార్గ వైఖరిని అవలంబిస్తూ, ఆశాల ఆశలపై నీళ్లు చల్లుతుండటం సిగ్గుచేటు అని కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఈ పరిణామాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. గ్రామ ప్రజలందరికీ మాతృమూర్తులుగా వ్యవహరిస్తున్న ఆశా వర్కర్లపై మగ పోలీసులతో దౌర్జన్యామా..? అని సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణ తల్లులపై ఏమిటీ దుర్మార్గం..? అని రేవంత్‌పై కేటీఆర్ మండిపడ్డారు. ఆశా వర్కర్లు మీకు తల్లుల్లా కనిపించడం లేదా..? ఏం పాపం చేశారని నడిరోడ్డుపై లాగిపారేస్తున్నారు..? దళిత, బహుజన ఆడబిడ్డలపై ఇంతటి అరాచకమా..? హోంమంత్రిగా ఉన్న మీకు ఆడవాళ్లంటే అంత చులకనా..? ఇందిరమ్మ రాజ్యమంటే అణచివేతలు, అక్రమ అరెస్టులేనా..? అని రేవంత్ రెడ్డిని కేటీఆర్ నిలదీశారు. ఆరు గ్యారెంటీలకు దిక్కులేదు కానీ.. ఏడో గ్యారెంటీగా ఎమర్జెన్సీని అమలుచేస్తున్నారంటూ కేటీఆర్ నిప్పులు చెరిగారు. మీ సర్కారు దాష్టీకానికి ఆశా నాయకురాలు సంతోషిని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. ఆమెకు మెరుగైన వైద్యసేవలు అందించాలి. ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి. లేకపోతే ఆశా వర్కర్ల ఆగ్రహజ్వాలను తట్టుకోలేరు అని కేటీఆర్ తేల్చిచెప్పారు.



# దొంగలతో రేవంత్ దోస్తీ

- **అసెంబ్లీకి వెళ్తే అడుకోవల్సిన అవసరం ఏమిటి**
- **రాహుల్ గాంధీ అదానీని వ్యతిరేకిస్తే**
- **ప్రాణాలకు తెగించి రాష్ట్రం సాధించిన మహోన్నతుడు కేసీఆర్**
- **రేవంత్ సపోర్టు చేస్తాడా..?అసెంబ్లీలో రేవంత్ అక్రమాలను ఎండగడతాం : మాజీ మంత్రి కేటీఆర్**

హైదరాబాద్, డిసెంబర్9 : దొంగలతో సీఎం రేవంత్‌రెడ్డి దోస్తీ చేస్తున్నాడని, అదానీ, రేవంత్ రెడ్డి ఒక్కటై తెలంగాణ ప్రజాలతో ఆడుతున్న నాటకాన్ని బయటపెడుతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అదానీ పట్ల కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నదని విమర్శించారు. అదానీ, రేవంత్ దోస్తానాను శాసనసభ వేదికగా ఎండగడతామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చేసిన దుర్మార్గపు ఆలోచనను ప్రజలకు వివరిస్తామన్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గన్‌పార్క్ వద్ద తెలంగాణ అమరవీరులకు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నివాళులు అర్పించారు. అమరులకు జోహార్.. వీరులకు జోహార్ అంటూ పాటపాడారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. “రాష్ట్ర సాధనలో భాగంగా పదవీ త్యాగంతో బీఆర్ఎస్ పార్టీ ప్రారంభమైందన్నారు. ప్రాణ త్యాగానికి కూడా సిద్ధపడిన తెలంగాణ మహానాయకుడు కేసీఆర్ అని అన్నారు. ఉద్యమ నాయకుడు కేసీఆర్ దీక్షకు దిగి దేశ రాజకీయ వ్యవస్థను మెడలు వంచిన రోజు, తెలంగాణ ప్రజా కదలికలతో ఢిల్లీ పాలకుల గుండెల్లో గుబులు పుట్టినరోజు డిసెంబర్ 9. దీక్ష ఫలవంతమైన డిసెంబర్ 9న దీక్షా విజయ్ దివస్‌గా జరుపుకుంటున్నామని గుర్తు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరులకు ఘనంగా నివాళులు అర్పించామని, కాంగ్రెస్ పార్టీ చేసిన దుర్మార్గపు ఆలోచనను ప్రజలకు వివరిస్తామన తెలిపారు. దేశ వ్యాప్తంగా అదానీ మంచివాడు కాదని కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేస్తున్నదని, కానీ రాష్ట్రంలో మాత్రం అదానీతో రేవంత్ రెడ్డి అలయ్ బలయ్ తీసుకుంటున్నాడని ఆరోపించారు. రాహుల్ గాంధీ అదానీపై ఇతర రాష్ట్రాల్లో దుర్మార్గపు ప్రచారం చేస్తుంటే ఇక్కడమాత్రం మంచివాడని అన్నట్లుగా ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. అదానీ, రేవంత్ ఒక్కటై తెలంగాణ ప్రజానికంతో ఆడుతున్న నాటకాన్ని బయటపెడతామనన్నారు. గురుకుల, లగచర్లలో గిరిజనుల నుంచి బలవంతంగా భూములు లాక్కొంటున్న విధానాన్ని, రైతన్నల సమస్యలు, నెరవేరని గ్యారంటీలు, 420 హామీలను తుంగలో తొక్కిన విధానాన్ని, రాష్ట్రంలో నెలకొన్న ప్రతి సమస్యను అసెంబ్లీలో చర్చకు పట్టుబడతామని తెలిపారు. తెలంగాణ అస్తిత్వంపై జరుగుతున్న దాడిని, ముఖ్యంగా తెలంగాణ తల్లిని మారుస్తానంటున్న రేవంత్ రెడ్డి దుర్మార్గపు ఆలోచనను నిరసిస్తూ తెలంగాణ ప్రజల ఆర్తిని రెండు సభల్లో వినిపిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు.

## సమావేశాలు సజావుగా జరగకుండా పాలకపక్షం కుట్ర

**కేసీఆర్ దీక్ష వల్లే తెలంగాణకు అనుకూలంగా ప్రకటన**

**మేం ఏ దుస్తులు వేసుకోవాలో స్పీకర్ చెబుతారా?**

**మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి**

హైదరాబాద్,డిసెంబర్ 9 : తాము అదానీ-రేవంత్ రెడ్డి ఉన్న టీ-షర్ట్ వేసుకెళితే తప్పేమిటని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పుల చెరిగారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... అసెంబ్లీ సమావేశాలు సజావుగా జరగకుండా పాలకపక్షం కుట్ర పన్నిందని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలను సభకు రాకుండా చేయాలని కుట్ర చేసిందన్నారు. అందుకే తమను అసెంబ్లీ బయటే అడ్డగించారన్నారు. ఇదివరకు ఎప్పుడూ ఇలా జరగలేదన్నారు. మేం ఏ దుస్తులు వేసుకోవాలో స్పీకర్ చెబుతారా? అని నిలదీశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో నిత్యం అదానీ మీదే మాట్లాడుతున్నారని... ఇక్కడేమో రేవంత్-అదానీ గురించి మాట్లాడవద్దని అంటారని ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ కూడా అదానీ-మోదీ ఉన్న టీషర్ట్ ధరించి పార్లమెంట్‌కు వెళ్లారని గుర్తు చేశారు. మరి తమను ఎందుకు అడ్డుకుంటున్నారో చెప్పాలన్నారు. తాము రాహుల్ గాంధీనే అనుసరించామని తెలిపారు. అసెంబ్లీని రేవంత్ రెడ్డి నడుపుతున్నారా? స్పీకర్, చైర్మన్ నడుపుతున్నారా? అని నిలదీశారు. కేసీఆర్ దీక్ష వల్లనే డిసెంబర్ 9న తెలంగాణకు అనుకూలంగా ప్రకటన వచ్చిందని గుర్తు చేశారు. ఈ విషయం కోదండరాంకు కూడా తెలుసని వెల్లడించారు. తెలంగాణను అదానీకి దోచిపెట్టే పనిలో రేవంత్ రెడ్డి ఉన్నారని ఆరోపించారు. రామన్నపేటలో సిమెంట్ ఫ్యాక్టరీ, లగచర్లలో పరిశ్రమలు అదానీ కోసమే అన్నారు.

## రోడ్డుపై వెళ్తున్న కారులో మంటలు..

**జోగేశ్వరీ బ్రిడ్జిపై ఈ ఘటన**

న్యూఢిల్లీ, డిసెంబర్9 : ఈ మధ్య కాలంలో రోడ్లపై పరుగులు పెడుతుండగానే వాహనాల్లో మంటలు చెలరేగుతున్న ఘటనలు పెరిగిపోతున్నాయి. బస్సులు, కార్లు, బైకులు అన్న తేడా లేకుండా అన్ని రకాల వాహనాలు ఇలాంటి అగ్ని ప్రమాదాల్లో చిక్కుకున్నాయి. కొన్ని ఘటనల్లో భారీగా ప్రాణ నష్టం కూడా జరిగింది. మెజారిటీ ఘటనల్లో మాత్రం ప్రాణ నష్టం తప్పింది. తాజాగా అలాంటిదే మరో ఘటన చోటుచేసుకుంది. రోడ్డుపై రయ్యిమని దూసుకెళ్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గమనించిన డ్రైవర్ వెంటనే కారును ఆపేసి బయటికి పరుగులు తీశాడు. ఆ తర్వాత మంటలు మరింత చెలరేగడంతో కారు పూర్తి గా కాలి బూడిదైంది. ఆ ప్రాంతంలో దట్టంగా పొగలు కమ్ముకున్నాయి. మహారాష్ట్ర రాజధాని ముంబైలోని జోగేశ్వరీ బ్రిడ్జిపై ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదానికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెప్పారు.

## తెలంగాణ ప్రజల ఆకాంక్షలే మాకు ముఖ్యం

**ఎక్కడైనా తల్లికి కిరీటం ఉంటుందా**

**తెలంగాణ ఇచ్చిన దేవత సోనియా గాంధీ**

**విగ్రహ ఏర్పాటు, రూపకల్పనపై అసెంబ్లీలో మంత్రుల వివరణ**

హైదరాబాద్,డిసెంబర్ 9 : తెలంగాన తల్లి రూపం, విగ్రహ ఏర్పాటుపై సిఎం రేంవత్ రెడ్డి చేసిన ప్రకటనపై అసెంబ్లీలో వాడీవేడీ చర్చ సాగింది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రులు అన్నారు. సోనియా గాంధీ లేకుంటే మరో జన్మలో కూడా తెలంగాణ వచ్చేది కాదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడుతూ..ఇది తెలంగాణ రాష్ట్ర ప్రకటన రోజు.. నాలుగు కోట్ల ప్రజల కోరిక తీరిన రోజు అని అభివర్ణించారు. ఈ విషయాన్ని సభలో ప్రతిపక్ష నేత గతంలో స్వయంగా ప్రకటించారని గుర్తుచేశారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ రోజున ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. గత పదేళ్లలో నీళ్లు, నిధులు, నియామకాలు ఏమీ రాలేదని చెప్పారు. అమ్మలాంటి తెలంగాణ తల్లిని ఆవిష్కరించుకుంటున్న ఈరోజు.. సభకు వచ్చి శుభాకాంక్షలు చెప్పేది పోయి.. బయట నిరసనలు చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. వారికి తెలంగాణపై ప్రేమ లేదని, సొంత ఎజెండాతో పనిచేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ తల్లి అంటే దేవతలా కాదు- మన ఇంట్లో అమ్మలా ఉండాలని తెలిపారు. తెలంగాణ తల్లి రూపంపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్ కు లేదని మంత్రి కోమటి రెడ్డి అన్నారు. తెలంగాణ రాదనుకున్న సమయంలో నాలుగుకోట్లు మంది ప్రజల ఆకాంక్ష నెరవేర్చి తల్లి సోనియా గాంధీ అన్నారు. తెలంగాణ ఇచ్చిన దేవతకు శుభాకాంక్షలు తెలిపారు. ఈరోజు చరిత్రలో నిలిచి పోయిన రోజు అన్నారు. మా ముద్దు బిడ్డ శ్రీకాంతాచారి ఎల్బీనగర్ చౌరస్తాలో కాల్చుకుని జై తెలంగాణ అనే నినాదంతో నాలుగు రోజులు మృత్యువుతో పోరాటం చేసి మృతి చెందాడని అసెంబ్లీలో గుర్తు చేసుకున్నారు. ఇవాళ చరిత్రలో నిలిచిపోయే రోజు.. మన ఆస్తిత్వనికి ప్రతికలైన వ్యవసాయం చేసుకునే తల్లిని ఇవ్వాల తెలంగాణ తల్లి రూపంలో గౌరవించుకునే సందర్భం అని మంత్రి అన్నారు. నాకు తెలంగాణ అంటే ఎక్కడ లేని అభిమానం అందుకే 11 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేశా అన్నారు. 3 సంవత్సరాలు మంత్రి పదవిని అనుభవించే అవకాశం ఉన్న రాజీనామా చేసిన తర్వాత మళ్ళీ అటు వైపు చూడలే అన్నారు. మిలియన్ మార్చ్ లో రబ్బర్ బు÷-లలెట్స్ తగిలినా వెనక్కి తగ్గలేదన్నారు. ఇన్ని చేసిన తర్వాత కూడా రాష్ట్రాన్ని అప్పులపాలు చేయడమే కాదు.. మన తల్లిలాంటి తల్లి లేకుండా కిరీటాలతో, వజ్ర వైడుర్యాలతో ఉన్న తల్లిని తీస్తారా అని కామెంట్స్ బాధాకరం అన్నారు. తెలంగాణ తల్లి అంటే చాకలి ఐలమ్మ లాగో, మన పల్లెటూరి తల్లిలాగో ఉంటుందని భావిస్తే.. ఇదేంటి ఇలా ఉందనిపించిందన్నారు. మన పోరాటాలు, ఉద్యమాలు, శ్రమజీవులకు ప్రతీకలైన వ్యవసాయం చేసుకునే మన తల్లిలాగ ఉండాలని ఇవ్వాల కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నూతన తెలంగాణ తల్లిని ఆవిష్కరించిందని తెలిపారు. తెలంగాణ అంటే ఆత్మగౌరవం, స్వేచ్ఛా, చైతన్యం.. కానీ, గత పదేండ్లలో జరిగిన సంఘటనలు మనకు మాయని మచ్చల్లా వెంటాడుతున్నయన్నారు. అందుకే, ఇప్పుడు తెలంగాణ అస్థిత్వాన్ని సరైన స్థానంలో నిలబెట్టాల్సిన అవసరం ఏర్పడిందని తెలిపారు. ఈ క్రమంలోనే మన అస్థిత్వానికి ప్రతీకలు, నిజాయితీకి నిలువుటద్దాలు, కష్టానికి ప్రతిరూపాలైన వ్యవసాయం చేసుకునే స్త్రీమూర్తిని.. పోలిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించామన్నారు. తెలంగాణ తల్లి నమూన విడుదల చేయగానే.. తలపై కిరీటం లేదు, మెడలో నె÷-లకెస్ లేదు, వంటికి పట్టుచీర లేదు.. తెలంగాణ అస్థిత్వాన్ని ఆగం చేస్తున్నరని కొందరు కామెంట్స్ చేస్తున్నారని మండిపడ్డారు.మన తల్లికి కిరటం లేదు.. మన తల్లికి మెడలో నెక్లేస్ లేదు.. అచ్చ



తెలంగాణ మహిళను పోలి ఉంటే ఆస్తిత్వం దెబ్బతిందా? అని ప్రశ్నించారు. కిరీటం లేదని అమ్మను అమ్మ కాదంటమా? ఇదెక్కడి వాదన అని అసెంబ్లీలో కోమటి రెడ్డి మండిపడ్డారు. మంత్రిగా.. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నాయకునిగా.. నేను వాళ్లకు ఒక మాట చెప్పదల్చుకున్న అన్నారు. రాజకీయ ఎదుగుదల కోసం తెలంగాణ పేరు తొలగించుకునే అవకాశవాద పార్టీ కాదు కాంగ్రెస్ అన్నారు. ?రాజకీయాల కోసం తెలంగాణను తీసేసి బీఆర్ఎస్ అని పెట్టుకున్నవాళ్లకి తెలంగాణ గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. ఈ రాష్ట్రంలో పార్టీ పేరుకు ముందు తెలంగాణ అని రాసుకునే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని తెలిపారు. ఇకపోతే తెలంగాణ రావడానికి కారణం సోనియాగాంధీ అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ చిహ్నంలో మార్పు జరగలేదన్నారు. తెలంగాణ గీతాన్ని రూపొందించి అధికారికంగా ఉపయోగిస్తున్నట్లు వివరించారు. గతంలో ఉన్న విగ్రహాలు పార్టీకి సంబంధించినవని చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహం ప్రభుత్వపరంగా లేదని పేర్కొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో ఏర్పాటు చేస్తున్నామని.. రాష్ట్ర ప్రజల భావోద్వేగాలకు అనుగుణంగా రూపకల్పన చేసినట్లు చెప్పారు. ఇటీవల వరదలు వస్తే కేంద్రం కేవలం రూ.400 కోట్లు ఇచ్చిందని విమర్శించారు. కేంద్రం నుంచి నిధుల సాధనకు అందరం కృషి చేయాలని పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. సొంత అజెండాతో తెలంగాణ తల్లి విగ్రహం చుట్టూ రాజకీయాలు చేస్తున్నారని మంత్రి సీతక్క విమర్శించారు. తమ ప్రభుత్వం రూపొందించిన విగ్రహంలో రాష్ట్ర ప్రజల అస్తిత్వం, ఆత్మగౌరవం, పోరాటం, శ్రమైక జీవనరూపం, ఆశీర్వాదం కలగలిసిన నిండైన రూపముందని చెప్పారు. శాసనసభలో సీతక్క మాట్లాడారు.‘తెలంగాణ తల్లి విగ్రహాన్ని మారుస్తున్నామంటూ భారాస, భాజపా నేతలు మాపై విమర్శలు చేస్తున్నారు. గత పదేళ్లలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎక్కడైనా అధికారికంగా ఆవిష్కరించారా? కేటీఆర్ సోదరికి దేవతా విగ్రహ రూపాన్ని ఇస్తే ఎలా ఉంటుందో అలా పెట్టుకొని దాన్ని రాష్ట్ర ప్రజలపై రుద్దారు. నేడు మేం తెలంగాణ బిడ్డల అస్తిత్వానికి అనుగుణంగా ఉండేలా విగ్రహాన్ని రూపొందించాం. గుండెల నిండా పాడుకునే 'జయజయహే తెలంగాణ' పాటను రాష్ట్ర గీతంగా ఏర్పాటుచేయాలనే ఆలోచన గత పాలకులకు రాలేదు. నేడు మేం చేస్తుంటే అడ్డుకుంటున్నారు. ఉద్యమ సమయంలో టీజీ అని.. అధికారంలోకి వచ్చాక టీఎస్ అని మార్చారు. అప్పుడు భాజపా మాట్లాడలేదు. పార్టీ పేరులో తెలంగాణ పదాన్ని తొలగించారు. ఇప్పుడు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పెట్టిన విగ్రహాన్ని చూస్తుంటే మా అక్కాచెల్లెళ్లను చూసినట్లే ఉంది. తెలంగాణ మహిళలు మట్టి బిడ్డలు.. ఆ శ్రామిక తత్వానికి ప్రతిరూపంగా రూపొందించాం‘ అని సీతక్క అన్నారు.

## తెలుగు సబ్జెక్ట్ తప్పనిసరేం కాదు

**9, 10 తరగతుల సిలబస్ లో స్వల్ప మార్పు**

**నిబంధనను 8వ తరగతి వరకు మాత్రమే అమలు చేయాలి**

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం**

హైదరాబాద్,డిసెంబర్9 : 10 తరగతి మినహా మిగతా బోర్డులకు సంబంధించిన పాఠశాలల్లో తెలుగు సబ్జెక్టు తప్పనిసరిగా అమలు చేయాలనే నిబంధనను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వల్ప మార్పులు చేసింది. ఈ నిబంధనను కేవలం 8వ తరగతి వరకు మాత్రమే అమలు చేయాలని, 9, 10 తరగతులకు మినహాయింపు ఇస్తున్నట్లు ప్రకటించింది.. తెలంగాణ రాష్ట్రంలో సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ ఇతర బోర్డుల్లో 9, 10 తరగతులు చదివే విద్యార్థులకు రాష్ట్ర సర్కార్ కీలక అప్‌డేట్ జారీ చేసింది. ప్రస్తుత (2024-25), వచ్చే విద్యా సంవత్సరం (2025-26) తొమ్మిదవ, పదో తరగతి చదివే విద్యార్థులు తెలుగును ఒక సబ్జెక్టుగా చదవడంపై మినహాయింపునిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రంలో 2018-19 విద్యా సంవత్సరం నుంచి పదో తరగతి వరకు పాఠశాల విద్యార్థులు తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా చేస్తూ చట్టం చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ చట్టం సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ ఇతర బోర్డుల్లో 1 నుంచి 8వ తరగతి వరకు మాత్రమే అమలు చేస్తున్నారు. 9, 10 తరగతుల విద్యార్థులు చదవడం లేదు. కేవలం ఐదు సబ్జెక్టులే చదువుతున్నారు. భాషా సబ్జెక్టుల్లో ఆంగ్లం, హిందీ మాత్రమే వీరంతా అభ్యసిస్తున్నారు. ఇతర బోర్డుల్లో తెలుగు మాతృభాష కానివారు కూడా అధిక సంఖ్యలో ఉండటమే ఇందుకు కారణం. దీంతో ఆ సబ్జెక్టులో తప్పనిసరిగా పాస్ కావాలంటే ఇబ్బందులు వస్తాయని భావించిన విద్యాశాఖ 2024-25, 2025-26 విద్యా సంవత్సరాలకు అమలును మినహాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్వల్ప మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్) 2025 ఫలితాలు విడుదలైన సంగతి తెలిసిందే. పరీక్ష రాసిన అభ్యర్థులు అప్లికేషన్ లేదా అడ్మిట్ కార్డు నంబర్, పుట్టిన తేదీ వివరాలను నమోదు చేసి స్కోరు కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దేశ వ్యాప్తంగా 141 పరీక్ష కేంద్రాల్లో డిసెంబర్ 1వ తేదీన క్లాట్ పరీక్ష జరిగిన సంగతి తెలిసిందే. కౌన్సెలింగ్ ప్రక్రియకు సంబంధించిన వివరాలు డిసెంబర్ 9న అందుబాటులో రానున్నాయి. ఇందులో వచ్చిన ర్యాంకు ఆధారంగా నేషనల్ లా స్కూల్స్, యూనివర్సిటీల్లో యూజీ, పీజీ డిగ్రీ ప్రోగ్రాలలో (ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం) ప్రవేశాలు కల్పిస్తున్నాయి. దేశవ్యాప్తంగా 24 ప్రధాన లా యూనివర్సిటీలు ఇందులో పాల్గొంటున్నాయి. కాగా ఆలిండియా స్థాయిలో ఏటా కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్)ను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దీనిలో మెరుగైన ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సులు ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో చదివేందుకు అవకాశం ఉంటుంది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
10 డిసెంబర్
2024





# పవన్ కళ్యాణ్ కు బెదిరింపులు..

### నేరుగా చంపేస్తామంటూ ఫోన్ కాల్స్

### ఫోన్ కాల్స్ రాకతో అప్రమత్తమైన పోలీసులు



అమరావతి, డిసెంబర్ 9 : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేషీకి బెదిరింపు కాల్స్ రావడంతో, పోలీసులు అప్రమత్తమయ్యారు. ఏకంగా పవన్ కళ్యాణ్ ను చంపేస్తామంటూ అగంతకుడు ఫోన్ చేయగా, పోలీసుల దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. ఇటీవల పవన్ కళ్యాణ్ కాకినాడ పోర్టును సందర్శించారు. ఆ పర్యటనలో అక్రమ రేషన్ దందాను వెలుగులోకి తెచ్చారు పవన్. కాకినాడ పోర్టుకు పర్యటన ఖరారు కాగానే, అడ్డుకునే ప్రయత్నం చేసినట్లు స్వయంగా పవన్ కళ్యాణ్ ప్రకటించారు. అప్పటివరకు కాకినాడ పోర్టు వ్యవహారం అంతగా వెలుగులోకి రానప్పటికీ, పవన్ పర్యటనతో కేంద్రం సైతం పోర్టుపై ప్రత్యేక నిఘా ఉంచింది. కాకినాడ పోర్టు వ్యవహారం పలు మలుపులు తిరుగుతూ, నిరంతరం వార్తలో నిలుస్తోంది. మొత్తం మీద కాకినాడ పోర్టు కేంద్రంగా సాగుతున్న అక్రమ దందాను పవన్ కళ్యాణ్ వెలుగులోకి తీసుకురావడంతో సంచలనంగా మారింది. తాజాగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేషీకి బెదిరింపు కాల్స్ వచ్చినట్లు తెలుస్తోంది. ఏకంగా పవన్ కళ్యాణ్ ను చంపేస్తామని హెచ్చరిస్తూ అగంతకుడు ఫోన్ చేసినట్లు సమాచారం. అలాగే అసభ్య పదజాలంతో మెసేజ్ లు కూడా రావడంతో, డిప్యూటీ సీఎం పేషీ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ విషయాన్ని ముందుగా పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లిన అధికారులు, అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ఈ బెదిరింపులకు పాల్పడింది ఎవరు? బెదిరింపుల వెనుక కాకినాడ పోర్టు వ్యవహారం ఉందా? లేక ఆకతాయి పనా? అనేది పోలీసులు దర్యాప్తులో తేలాల్సి ఉంది. డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న పవన్ కళ్యాణ్ కు భద్రత మరింత పటిష్టం చేయాలని జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారు.

# ఎమ్మెల్సీగా బొర్రా గోపిమూర్తి ఘన విజయం

### 3,906 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపు

అమరావతి, డిసెంబర్ 9 : ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎస్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి ఘన విజయం సాధించారు. బొర్రా గోపిమూర్తి తన సమీప అభ్యర్థి గంధం నారాయణ రావుపై 3,906 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు.ఆయన మొదటి ప్రాధాన్యత ఓట్లతో విజయం సాధించారు. ఆయనకు ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు తదితరులు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ రోడ్డు ప్రమాదంలో మరణించడంతో అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో కేంద్ర ఎన్నికల సంఘం నవంబర్ 4న ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఉప ఎన్నికకు షెడ్యూల్ విడుదల చేసింది. దీనికి సంబంధించిన పోలింగ్ డిసెంబర్ 5న జరిగింది. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో మొత్తం 116 పోలింగ్ కేంద్రాల్లో 16,737 ఓట్లకు గానూ, 15,494 (92.62 శాతం) ఓట్లు పోలైయ్యాయి.ఓట్ల లెక్కింపు ప్రక్రియ కాకినాడ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ)లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలో జరిగింది. 14 టేబుల్స్‌పైన తొమ్మిది రౌండ్లలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి చేశారు. 15,494 ఓట్లకు గాను ఉపాధ్యాయ సంఘం యూటీఎఫ్ బలపరిచిన పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి (9,165 ఓట్లు) తన సమీప అభ్యర్థి, ఎస్‌టీయూ బలపరిచిన గంధం నారాయణ రావు (5,259)పై 3,906 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. ఇతర అభ్యర్థులు పులుగు దీపక్‌కు 102, నామన వెంకట లక్ష్మీకి 81, కావల నాగేశ్వరరావుకి 73 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో భారీగా చెల్లని ఓట్లు పడ్డాయి. చెల్లని ఓట్లు 814 పడ్డాయి. ఉపాధ్యాయులు ఓటర్లుగా ఉన్న ఈ ఎన్నికల్లో చెల్లని ఓట్లు భారీగా పడటంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులు కూడా సరిగా ఓట్లు వేయలేకపోతున్నారని అభిప్రాయం వ్యక్తం అవుతుంది. 2021లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన షేక్‌సాబ్జీ కంటే, ఇప్పుడు గెలుపొందిన బొర్రా గోపిమూర్తి మెజార్టీ ఎక్కువగా నమోదు అయింది. ఆ ఎన్నికల్లో 17,467 ఓట్లకు 16,054 ఓట్లు పోలయ్యాయి. అందులో యూటీఎఫ్ తదితర సంఘాలు బలపరిచిన షేక్ సాబ్జీకి 7,987 ఓట్లు వచ్చాయి. ఆయన తన సమీప అభ్యర్థి, వైసీపీతో పాటు, పీఆర్‌టీయూ మద్దతిచ్చిన గంధం నారాయణరావు (6,453 ఓట్లు)పై 1,534 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అప్పుడు టీడీపీ మద్దతు ఇచ్చిన అభ్యర్థి చెరుకూరి సుభాష్ చంద్రబోసుకు 106 ఓట్లు, బీజేపీ మద్దతు ఇచ్చిన ఇళ్ల సత్యనారాయణకు 300 ఓట్లు వచ్చాయి. అప్పుడు 363 ఓట్లు చెల్లని నమోదు అయ్యాయి. ఈసారి ఓట్లు తగ్గినప్పటికీ మెజార్టీ పెరిగింది. మెజార్టీ 3,906 ఓట్లకు పెరిగింది. మరోవైపు రెండుసార్లు ఓటమి చెందిన గంధం నారాయణరావుకు పోలైన ఓట్ల సంఖ్య తగ్గింది. కాగా సంఘం నిర్ణయం మేరకు వాలంటీర్ రిటైర్మెంట్ తీసుకుని ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేశానని ఎమ్మెల్సీగా ఎన్నికైన గోపిమూర్తి తెలిపారు. సీపీఎస్ రద్దు కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని రంగాల్లో వలె విద్యారంగంలో ఉన్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్, జెఎల్ ప్రమోషన్,అందరికీ హెల్త్ కార్డులు, ఐటీడీఏ పాఠశాలల్లో అప్ గ్రేడేషన్, జీవో నెంబర్ 3 అమలు, మున్సిపల్, ఎయిడెడ్ టీచర్ల సమస్యలు, ఎయిడెడ్ పాఠశాలల పోస్టుల భర్తీ, మోడల్ స్కూల్స్, కేజీబీవీ టీచర్ల సమస్యలు తదితర సమస్యల సాధనకై పీడీఎఫ్ ఎమ్మెల్సీలతో కలిసి భవిష్యత్తులో పోరాటం చేస్తానని అన్నారు.

# ఇంట్లో పేలుడు ముగ్గురు మృతి

కోల్‌కతా,డిసెంబర్ 9 : ఒక ఇంట్లో పేలుడు సంభవించింది.పేలుడు ధాటికి ఇంటి పైకప్పు కూలిపోయింది. ఈ సంఘటనలో ముగ్గురు మరణించారు. పలువురు గాయపడ్డారు. ఆ ఇంట్లో బాంబులు తయారు చేస్తుండగా ఈ పేలుడు జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం రాత్రి ఖయర్తాలా ప్రాంతంలోని ఒక ఇంట్లో దేశీయ బాంబులు పేలాయి. పేలుడు ధాటికి ఇంటి పైకప్పు కూలిపోయింది. రాత్రి వేళ పేలుడు శబ్దం విని స్థానికులు భయాందోళన చెందారు. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ పేలుడులో ముగ్గురు మరణించగా పలువురు గాయపడినట్లు తెలిపారు. మృతులను మామున్ మొల్లా, సకీరుల్ సర్కార్, ముస్తాకిన్ షేక్‌గా గుర్తించినట్లు చెప్పారు. మామున్ మొల్లా ఇంట్లో దేశీయ బాంబులు తయారు చేస్తున్నట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బాంబులు పేలడంతో ముగ్గురు వ్యక్తులు మరణించినట్లు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం

### మరో 24 గంటల్లో బలపడే అవకాశం

### కోస్తా, రాయలసీమలో మూడ్రోజుల పాటు భారీ వర్షాలు

అమరావతి, డిసెంబర్ 9 : ఆగ్నేయ బంగాళాఖాతం, హిందూ మహాసముద్రం మీద అల్పపీడన ప్రాంతం, దాని అనుబంధ ఉపరితల ఆవర్తనం సగటు సముద్రానికి 5.8 కి.మీ.ల ఎత్తు వరకు విస్తరించి కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ, వచ్చే 24 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందని పేర్కొంది. అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా ప్రయాణించి, ఆ తర్వాత డిసెంబర్ 11వ తేదీ నాటికి నైరుతి బంగాళాఖాతం వద్ద శ్రీలంక- తమిళనాడు తీరాలకు చేరుతుందని అధికారులు తెలిపారు. ఆగ్నేయ బంగాళాఖాతంలోని అల్పపీడనం ప్రభావంతో ఏపీలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ ప్రకటించింది. అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, నెల్లూరు, కర్నూలు,నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్ జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉంది. బుధవారం నుంచి శుక్రవారం వరకు కోస్తా, రాయలసీమలో ముఖ్యంగా చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. రైతులు వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు



తీసుకోవాలని అధికారులు తెలిపారు. పండించిన ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాలలో ఉంచాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్ లో ఆకాశం సాధారణంగా మేఘావృతమై ఉంటుందని తెలిపింది. ఉదయం వేళల్లో పొగమంచు ఉండే అవకాశం ఉంది. నగరంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షం లేదా చినుకులు పడే ఛాన్స్ ఉంది. హైదరాబాద్ లో గరిష్ట ఉష్ణోగ్రత 29 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత 21 డిగ్రీల సెల్సియస్ ఉంటుంది. ఉపరితల గాలులు దక్షిణ, నైరుతి దిశలో గంటకు 4-8 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది. రాష్ట్రంలోని జిల్లాల్లో రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

# విజయసాయిరెడ్డి పద్ధతిగా మాట్లాడాలి

### తప్పులు బయటపడుతున్నాయని ఇష్టానుసారం మాటలు

### విజయసాయిరెడ్డిపై కేసులు నమోదు చేస్తాం

### ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత



అమరావతి, డిసెంబర్ 9 : చేసిన తప్పులు బయటపడుతున్నాయనే భయంతో వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ఇష్టానుసారం మాట్లాడుతున్నారని ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత మండిపడ్డారు. స్థాయి, వయసు మరిచిపోయి చిల్లరగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. చంద్రబాబును విమర్శించినా... తమకు, పవన్ కల్యాణ్ కు మధ్య చిచ్చు పెట్టాలని ప్రయత్నించినా విజయసాయిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. పద్ధతిగా మాట్లాడాలని హితవు పలికారు. తనపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసుకోవాలని విజయసాయి ధైర్యంగా చెప్పాలని అనిత అన్నారు. ఆయనపై కచ్చితంగా కేసులు నమోదు చేస్తామని చెప్పారు. రేషన్ బియ్యం అక్రమాలపై కూడా విచారణ జరుగుతోందని... నిందితులను వదిలిపెట్టబోమని చెప్పారు. వైసీపీ నేతలు ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తే వచ్చే ఎన్నికల్లో ఆ 11 సీట్లు కూడా రావని అన్నారు. విజయవాడలోని సబ్ జైలును ఈరోజు అనిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జైల్లో పరిస్థితులను తెలుసుకోవడానికి వచ్చానని చెప్పారు. జైల్లో మౌలిక వసతులపై ఆరా తీయడం జరిగిందని తెలిపారు. జైలు అధికారులపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరుగుతోందని, రెండు రోజుల్లో నివేదిక వస్తుందని, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# దేశంలో కలకలం రేపుతున్న బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 9 : దేశంలో వరుస బాంబు బెదిరింపులు కలకలం రేపుతున్నాయి. ఇవాళ ఉదయం దేశ రాజధాని ఢిల్లీలోని ఏకంగా 44 పాఠశాలలకు ఇలాంటి బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా మహారాష్ట్రలోని ఓ హోటల్‌కు ఈ తరహా బెదిరింపులే వచ్చాయి. నాగ్‌పూర్‌లోని గణేష్‌పేట్ కాలనీ ప్రాంతంలో గల హోటల్ ద్వారకామాయికి బాంబు బెదిరింపులు వచ్చాయి. ఆగంతకులు ఈ మెయిల్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారు. అప్రమత్తమైన హోటల్ యాజమాన్యం వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో ఘటనాస్థలికి చేరుకొని తనిఖీలు చేపట్టారు. అందులోని సిబ్బందిని బయటకు పంపించారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులూ, పేలుడు పదార్థాలూ లభించలేదని నాగ్‌పూర్ పోలీస్ డీసీపీ రాహుల్ మక్నికర్ తెలిపారు. ఈ ఘటనపై విచారణ చేపట్టినట్లు వెల్లడించారు. కాగా, సోమవారం ఉదయం ఢిల్లీలోని 44 పాఠశాలలకు ఇలాంటి బెదిరింపులే వచ్చిన విషయం తెలిసిందే. ఆర్కే పురంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పశ్చిమ్ విహార్‌లోని జీడీ గోయెంకా స్కూల్ సహా మొత్తం 44 పాఠశాలలకు ఈ మెయిల్స్ ద్వారా బెదిరింపులు వచ్చాయి. ఆయా పాఠశాలల ఆవరణలో బాంబులు అమర్చినట్లు ఆగంతకులు బెదిరింపులకు పాల్పడ్డారు. వాటిని పేల్చకుండా ఉండాలంటే 30 వేల డాలర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ సాయంతో ఆయా పాఠశాలల్లో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు, అనుమానాస్పద వస్తువులూ కనిపించలేదని పోలీసులు తెలిపారు. కాగా, ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఈ బెదిరింపులు వచ్చినట్లు గుర్తించారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# టీడీపీలో కలకలం సృష్టిస్తోన్న యనమల లేఖ

### కాకినాడ సెజ్ లక్ష్యంగా విమర్శనాస్త్రాలు

### కేవీ రావు చౌదరిపై విమర్శలు చేస్తూ లేఖ

### వైసీపీని కూడా వదలని రామకృష్ణుడు

### అరబిందోకి రూ.4,000 కోట్లకు కొనుగోలు చేశారాణి ఆరోపణ

అమరావతి, డిసెంబర్ 9 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు లేఖాస్త్రాం సంధించారు. ప్రస్తుతం ఈ లేఖ టీడీపీలో కలకలం సృష్టిస్తోంది. కాకినాడ సెజ్ లక్ష్యంగా ఆయన లేఖ ఉంది. టీడీపీ అధినేత చంద్రబాబుకు సన్నితంగా ఉన్న కేవీ రావు చౌదరిపై విమర్శలు చేస్తూ.. లేఖలో అనేక అంశాలు పేర్కొన్నారు. ఈ లేఖపై టీడీపీ అధికారికంగా స్పందించలేదు. కాకినాడ సెజ్ పెద్ద షాట్లు (కంపెనీలు) ప్రయోజనాలను పొందాయి. బీసీ, చిన్న రైతులు, మత్స్యకారుల నుండి తక్కువ ధరలకు కొనుగోలు చేయడం లేదా భూసేకరణ చేయడం దీనికి కారణమని విమర్శించారు. కాకినాడ ఓడరేవు సొంత చేసుకున్న కేవీ రావు చౌదరికి చెందిన బడా కంపెనీలు.. కాకినాడ సెజ్‌లో భూమిని తక్కువ ధరలకు పొందాయి. ఆ భూమిని జీఎంఆర్ (వైశ్య)కి కె.వి రావు చౌదరి వందల కోట్లకు అమ్మారు. ఆ తరువాత అరబిందో (జగన్మోహన్ రెడ్డి బినామీ)కి దాదాపు రూ.4,000 కోట్లకు కొనుగోలు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం క్లెయిమ్ చేసిన భూమిని దివీస్ (మురళీ చౌదరి)తో సహా పరిశ్రమలను స్థాపించడానికి రూ.500 కోట్లు ఇచ్చారు. కోన అటవీ వాసులకు అనుకూలంగా ప్రభుత్వం చర్యలు ప్రారంభించకుంటే, వారి వాస్తవ సమస్యల కోసం నిరంతరం పోరాడుతామని, వారి జీవనోపాధిని కాపాడేందుకు వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని యనమల కోరారు. చెన్నైలోని ఎన్‌జీటీ, సీఎంఎస్, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ, ఏపీ పొల్యూషన్ బోర్డుకు లేఖలు రాశాను. ఇవి చర్య తీసుకోవడానికి స్వతంత్ర సంస్థలుగా పరిగణించబడతాయి. కానీ వాస్తవానికి రాజకీయ నియంత్రణలో ఉంటాయి. పరిష్కరిస్తారా? లేదా? అనేది ప్రభుత్వాల ముందు ఉంది.ప్రభుత్వం తమకు అనుకూలంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు. కాకినాడ సెజ్‌లోని కొన్ని భూములను మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే వంటి స్థానిక వైసీపీ నాయకులు బలవంతంగా తీసుకున్నారు. ఆ భూములను డి-నోటిఫికేషన్ చేసిన తర్వాత భూ సేకరణ అసలు భూ యజమానులకే దక్కాలి. కానీ వైసీపీ ప్రభుత్వంలో అది జరగలేదని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో తమ నాయకులకు అనుకూలంగా మొత్తం ఫ్రాడ్ చేసారు. ఇది పూర్తిగా చట్టవిరుద్ధం. అలాగే ఇది భూసేకరణ చట్టం స్ఫూర్తికి విరుద్ధం. దీనిపై విచారణ అవసరం. సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వం ఆ భూములను అసలు రైతులకు ఇవ్వాలి. కాకినాడ సెజ్ భూములను అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలి. అలాంటి భూములను అసలు భూ యజమానులకు అప్పగించాలని రైతులు కోరుతున్నారు. లేనిపక్షంలో న్యాయం కోసం ఆందోళనలు ఉధృతం చేస్తాం. స్థానికులను రక్షించేందుకు మీడియా ముందుకు



వస్తామన్నారు. ఎలాంటి తీవ్ర ఆందోళనలు జరగకుండా ఉండేందుకు ఏపీ పొల్యూషన్ బోర్డు సభ్యుడు, ఎన్‌జీటీ ప్రతినిధి, రాష్ట్ర, జిల్లా అధికారులతో అధికారిక కమిటీని ఏర్పాటు చేసి, స్థానిక సమస్యలను పరిష్కరించడానికి వారు ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు. లేదంటే ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు,. కేవీ రావు కూడా కాకినాడ సెజ్‌లో నష్టపోయిన వారికి న్యాయం చేయలేదు. వంద కోట్ల నుంచి వెయ్యి కోట్ల వరకు ఆయన (కేవీ రావు) ఆర్జించి, బాధితులకు కొద్ది మొత్తమే ఇచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ధనికులు (ప్లూటోక్రాట్లు) లాభపడుతుండగా, బలహీన వర్గాలు (పేదలు) సంపద సృష్టిలో, రాజకీయాల్లో పాల్గొనడంలో, అభివృద్ధి ముసుగులో నష్టపోతున్నారు. బిగ్ షాట్‌ల బారి నుండి బీసీ రైతులు, మత్స్యకారులను రక్షించండి. అప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం ఉంటుంది. వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని అభ్యర్థించారు. ఈ సుదీర్ఘ లేఖపై అధికార టీడీపీ, జనసేన, బీజేపీ నుంచి ఎటువంటి స్పందన రాలేదు. కాకపోతే ఆయా పార్టీల్లో ఈ లేఖపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. మరోవైపు ఈ లేఖలో చంద్రబాబు సన్నిహితుడిపై చేసిన ఆరోపణలతో పాటు వైసీపీ నేతలపై కూడా బలమైన ఆరోపణలు చేశారు. కానీ వైసీపీ కూడా ఈ లేఖపై స్పందించలేదు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
10 డిసెంబర్
2024






# డబ్ల్యూటీసీ టేబుల్లో టాప్‌లోకి సౌతాఫ్రికా

## శ్రీలంకను క్లీన్‌స్వీప్ చేసిన సౌతాఫ్రికా

వరల్డ్ టెస్ట్ ఛాంపియన్షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల టేబుల్లో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. శ్రీలంకను రెండు టెస్టుల సిరీస్ లో 2-0తో చిత్తు చేసిన సౌతాఫ్రికా ఒకేసారి టాప్ లోకి దూసుకెళ్లింది. ఇప్పటి వరకూ ఆ స్థానంలో ఉన్న ఆస్ట్రేలియాను వెనక్కి నెట్టింది. ఈ సిరీస్ విజయంతో సౌతాఫ్రికా మరొక్క టెస్టులో గెలిస్తే చాలు డబ్ల్యూటీసీ ఫైనల్ చేరుతుంది. ఆస్ట్రేలియా చేతుల్లో టీమిండియా రెండో టెస్టులో ఓటమి.. ఇటు శ్రీలంకపై సౌతాఫ్రికా క్లీన్ స్వీప్ తో డబ్ల్యూటీసీ పాయింట్ల టేబుల్ మారిపోయింది. తొలి స్థానంలోకి వెళ్లిన సౌతాఫ్రికా.. ఇప్పుడు పాకిస్థాన్ తో జరగబోయే రెండు టెస్టుల్లో ఒకదాంట్లో గెలిచినా ఫైనల్ వెళ్తుంది. డిసెంబర్ 26 నుంచి సౌతాఫ్రికా, పాకిస్థాన్ రెండు టెస్టుల సిరీస్ ప్రారంభం కానుంది. సఫారీలు ఫస్ట్ ప్లేస్ లోకి వెళ్లడంతో ఆస్ట్రేలియా రెండు, టీమిండియా మూడో స్థానంలోకి పడిపోయాయి. ఈ సిరీస్ ఓటమితో శ్రీలంక మాత్రం ఫైనల్ రేసు నుంచి దాదాపు తప్పుకున్నట్లయింది. సౌతాఫ్రికా ఈ డబ్ల్యూటీసీ సైకిల్లో 10 టెస్టులు ఆడి ఆరు గెలిచి, మూడు ఓడిపోయింది. ఒకటి డ్రా అయింది. 76 పాయింట్లు, 63.33 పర్సెంటేజ్ తో టాప్ లో ఉంది. ఇక ఆస్ట్రేలియా టీమ్ 14 మ్యాచ్ లు ఆడి 9 గెలిచింది. మరో నాలిగింట్లో ఓడగా.. ఒకటి డ్రా అయింది. 102 పాయింట్లు, 60.71 పర్సెంటేజ్ తో రెండో స్థానంలో ఉంది. టీమిండియా విషయానికి వస్తే 16 టెస్టుల్లో 9 గెలిచి, ఆరు ఓడింది. ఒకటి డ్రా అయింది. 110 పాయింట్లు, 57.29 పర్సెంటేజ్ తో మూడో స్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో శ్రీలంక, ఇంగ్లండ్, న్యూజిలాండ్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, వెస్టిండీస్ ఉన్నాయి.

# భారత్ కు వెళ్లి.. వారి సొంతగడ్డపైనే ఓడించాలి: షోయబ్ అక్తర్



పాకిస్థాన్ వేదికగా 2025 లో జరిగే ఛాంపియన్స్ ట్రోఫీ పై సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. ఆ దేశంలో పర్యటించేది లేదని ఇప్పటికే బీసీసీఐ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఛాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నీని హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించడానికి ససేమిరా అంటూ వచ్చిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఎట్టకేలకు దిగి వచ్చింది. పాక్లో పర్యటించడానికి భారత్ నిరాకరిస్తున్న నేపథ్యంలో ఐసీసీ చెప్పినట్లే ఆ జట్టు మ్యాచ్లను తటస్థ వేదికలో నిర్వహించేలా హైబ్రిడ్ పద్ధతికి అంగీకరిస్తామని పీసీబీ తెలిపింది. ఈ విషయంలో పాక్ బోర్డు ఓ మెలిక పెట్టింది. భవిష్యత్తులో తమ జట్టు కూడా ఐసీసీ టోర్నీల కోసం భారత్ కు వెళ్లకూడదని నిర్ణయిస్తే.. ఆ మ్యాచ్లను తటస్థ వేదికల్లో నిర్వహించేలా తమకు హామీ ఇవ్వాలని పేర్కొంది. ఈ నిర్ణయాన్ని ఆ జట్టు మాజీ పేసర్ షోయబ్ అక్తర్వ్యతిరేకించాడు. ఓ క్రీడా ఛానల్ మాట్లాడుతూ.. ఛాంపియన్స్ ట్రోఫీపై ఆసక్తికర వ్యాఖ్య చేశాడు. హైబ్రిడ్ మోడల్లో నిర్వహించే ఈ టోర్నీ రెవెన్యూలో అధిక వాటాను పీసీబీ డిమాండ్ చేయడాన్ని షోయబ్ అక్తర్ సమర్థించాడు. ఇది సరైన నిర్ణయమేనని పేర్కొన్నాడు. భవిష్యత్లో ఐసీసీ ఈవెంట్ల కోసం భారత్ కు వెళ్లకూడదన్న వైఖరిపై మాత్రం అభ్యంతరం వ్యక్తంచేశాడు. వారిని సొంతగడ్డపైనే ఓడించేలా పాక్ జట్టును నిర్మించాలని కోరాడు. మన దేశంలో నిర్వహించే ఛాంపియన్స్ ట్రోఫీకి వారు రావడానికి ఇష్టపడకపోతే ఎక్కువ రెవెన్యూను పంచాలన్న పీసీబీ డిమాండ్ సహేతుకమే. దీనిని మనమందరం అర్థం చేసుకుంటాం అన్నారు. భవిష్యత్లో భారత్లో ఆడే విషయంలో మనం స్నేహ హస్తం చాచాలి.. అక్కడికి వెళ్లాలి.. భారత్ కు వెళ్లి.. వారిని సొంతగడ్డపైనే ఓడించాలన్నారు.



# సిరాజ్, హెడ్‌పై ఐసీసీ చర్యలు

అడిలైడ్‌లో ఆసీస్, భారత్ మధ్య జరిగిన టెస్టులో మహ్మద్ సిరాజ్ -ట్రావిస్ హెడ్ మధ్య మాటల యుద్ధాన్ని ఐసీసీ తీవ్రంగా పరిగణించింది. సిరాజ్ మ్యాచ్ ఫీజులో 20శాతం జరిమానాగా విధిస్తూ నిర్ణయం తీసుకుంది. తోటి క్రీడాకారుడి పట్ల మైదానంలో అనుచితంగా ప్రవర్తించడం ద్వారా ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని 2.5 ఆర్టికల్‌ను ఉల్లంఘించినందుకు అతడి మ్యాచ్ ఫీజులో 20శాతం పెనాల్టీ విధించినట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. అలాగే, హెడ్‌పైనా చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. క్రమశిక్షణ ఉల్లంఘనకు గాను ఇద్దరికీ ఒక్కో డీమెరిట్ పాయింట్‌ను జరిమానాగా విధించింది. ఇద్దరూ తమ తప్పుల్ని అంగీకరించారని, మ్యాచ్ రిఫరీ ప్రతిపాదించిన చర్యలకు అంగీకారం తెలిపారని పేర్కొంది.



# ధోని, కోహ్లీల చెత్త రికార్డు జాబితాలో రోహిత్ శర్మ

అడిలైడ్ ఓవల్ వేదికగా జరిగిన రెండో టెస్టు మ్యాచ్ లో ఆస్ట్రేలియా చేతిలో భారత్ 10 వికెట్ల తేడాతో ఓడిపోయింది. దీంతో ఎంఎస్ ధోని, విరాట్ కోహ్లీల చెత్త రికార్డు జాబితాలో భారత కెప్టెన్ రోహిత్ శర్మ చేరాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ 2024-25లో భాగంగా పెర్త్ టెస్టులో 295 పరుగుల తేడాతో విజయం సాధించిన తర్వాత అడిలైడ్‌లో టీమిండియా బ్యాట్స్‌మెన్‌లు ధీమాగా ఉన్నట్లు కనిపించారు. మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంటుందనీ, రోహిత్ శర్మ పునరాగమనంతో జట్టు మంచి ప్రదర్శన కనబరుస్తుందని అందరూ భావించారు.. కానీ, అదేమీ జరగకుండా ఆస్ట్రేలియా చేతిలో భారత్ 10 వికెట్ల తేడాతో ఓడిపోయింది. రెండో టెస్టులో ఆస్ట్రేలియా 10 వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించింది. ఈ ఓటమితో హిట్ మ్యాన్ రోహిత్ శర్మ పేరిట చెత్త రికార్డును నమోదుచేశాడు. భారత కెప్టెన్ల చెత్త రికార్డు జాబితాలో ఉన్న ఎంఎస్ ధోనీ, విరాట్ కోహ్లీలో రోహిత్ చేరాడు. అడిలైడ్ ఓవల్‌లో గులాబీ బంతితో ఆడిన మ్యాచ్‌లో భారత్ ఓటమి భారత కెప్టెన్‌గా రోహిత్‌కి వరుసగా నాలుగో టెస్టు ఓటమి. మూడు రోజులలో ఆస్ట్రేలియాతో జరిగిన పింక్-బాల్ టెస్ట్‌లో ఓడిపోవడానికి ముందు 2024 అక్టోబర్-నవంబర్‌లో న్యూజిలాండ్‌పై రోహిత్ కెప్టెన్సీలో భారత్ మూడు బ్యాక్-టు-బ్యాక్ టెస్టులను కోల్పోయింది. వరుసగా నాలుగు టెస్టు మ్యాచ్‌ల్లో ఓడిన ఆరో భారత కెప్టెన్‌గా రోహిత్ శర్మ చెత్త రికార్డు నమోదు చేశాడు. వరుసగా నాలుగు టెస్టుల్లో ఓడిన తొలి భారత కెప్టెన్ దత్తా గైక్వాడ్. అతని నాయకత్వంలో, 1959లో జూన్ 4 నుండి ఆగస్టు 24 వరకు ఆడిన ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంగ్లండ్‌తో భారత్ వరుసగా నాలుగు టెస్టులను కోల్పోయింది. పటౌడీ 1967-68 సీజన్‌లో గైక్వాడ్‌తో అవాంఛిత జాబితాలో చేరాడు. పటౌడీ కెప్టెన్సీలో భారత్ ఆరు వరుస టెస్టుల్లో ఓటములను చవిచూసింది. సచిన్ టెండూల్కర్ 1999-2000 సీజన్‌లో భారత కెప్టెన్‌గా వరుసగా ఐదు టెస్టుల్లో టీమ్ ఓడిపోయింది. %మీ% ధోని కెప్టెన్సీలో భారత్ రెండుసార్లు వరుసగా నాలుగు టెస్టుల్లో ఓడిపోయింది. టెస్టుల్లో భారత్‌కు అత్యంత విజయవంతమైన కెప్టెన్‌గా నిలిచిన విరాట్ కోహ్లి 2020-21 సీజన్‌లో భారత కెప్టెన్‌గా నాలుగు వరుస పరాజయాలను చవిచూశాడు.

# భారత జట్టుకు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ కష్టమేనా?




రోహిత్ శర్మ సారథ్యంలోని భారత జట్టు ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టెస్టు మ్యాచ్‌లో 10 వికెట్ల తేడాతో ఓటమిని చవిచూసింది. ఈ మ్యాచ్ తర్వాత ఐదు మ్యాచ్‌ల సిరీస్ 1-1తో సమమైంది.బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భారత్ జట్టుకు బిగ్ షాక్ తగిలింది. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్టులో సూపర్ విక్టరీ అందుకున్న భారత జట్టు రెండో టెస్టులో మాత్రం ఢీలా పడింది. భారత్ జట్టు పై ఆస్ట్రేలియా 10 వికెట్ల తేడాతో అద్భుతమైన విజయంతో పునరాగమనం చేసింది. పింక్ బాల్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా ఘోర పరాజయాన్ని చవిచూడాల్సి వచ్చింది. పింగ్ బాల్ టెస్టు ఆడటం భారత్‌కు ఎప్పుడూ నష్టమే కలిగిస్తోంది. భారత జట్టు గత రెండున్నరేళ్లుగా పింగ్ బాల్ తో ఎలాంటి మ్యాచ్ లను ఆడలేదు. దీనికి తోడు భారత బ్యాటర్లు పెద్దగా రాణించలేకపోయారు. భారీ అంచనాలున్న రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రిషబ్ పంత్, యశస్వి జైస్వాల్ లు రాణించలేకపోయారు. అలాగే, అనుకూల పరిస్థితుల్లో ఆస్ట్రేలియన్ బౌలర్లు భారత బలహీన బ్యాటింగ్ లైనప్‌పై చాలా బాగా రాణించారు. దీంతో కంగారుల చేతిలో భారత్ ఓటమి నుంచి తప్పించుకోలేకపోయింది. టీమిండియా ఈ మ్యాచ్‌లో ఓటమి తర్వాత ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ సమీకరణాలు కూడా మారిపోయాయి. అడిలైడ్ ఓవల్ వేదికగా జరిగిన రెండో టెస్టు మ్యాచ్ లో ఆసీస్ చేతిలో భారత్ ఓడిపోయింది. ఈ ఓటమి ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో భారత్ స్థానంపై తీవ్ర ప్రభావం చూపింది. రెండుసార్లు ఫైనల్స్‌కు చేరిన భారత జట్టు ఇప్పుడు మూడో స్థానానికి పడిపోయింది. ఓటమి తర్వాత భారత్ పాయింట్ల శాతం (పీసీటీ) 57.29కి దిగజారడంతో ఇప్పుడు ఫైనల్ చేరే మార్గం కష్టంగా మారింది. మరోవైపు పెర్త్‌లో ఎదురుదెబ్బ తగిలిన ఆస్ట్రేలియా మళ్లీ పోటీలోకి దిగింది. ఇప్పుడు 60.71 పీసీటీతో పాయింట్ల పట్టికలో మొదటి స్థానానికి చేరుకుంది. ప్రస్తుత ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో భారత్‌కు మూడు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ఈ మూడు మ్యాచ్‌లు టీమిండియా తప్పక గెలవాలి. ఇప్పుడు ఆస్ట్రేలియాలో భారత్ ఎలాంటి తప్పులు చేయకుండా మిగిలిన మూడు మ్యాచ్‌లను గెలిస్తే ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ పాయింట్ల పట్టికలో %భాజు% 64.03కి చేరుకుంటుంది. అయితే దీని తర్వాత కూడా ఫైనల్‌లో స్థానం కన్ఫర్మ్ కాదు. ఇదే సమయంలో శ్రీలంకపై అద్భుత ప్రదర్శన చేసి దక్షిణాఫ్రికా జట్టు రెండో స్థానంలోకి చేరింది. ఈ ఓటమితో భారత జట్టు 57.29 శాతం మార్కులతో మూడో స్థానానికి పడిపోయింది. 59.26 శాతం మార్కులతో దక్షిణాఫ్రికా రెండో స్థానంలో ఉంది. ఆస్ట్రేలియా తన మిగిలిన ఐదు మ్యాచ్‌లలో మూడింటిని (భారత్‌పై మూడు, శ్రీలంకపై రెండు) గెలిస్తే అది ఫైనల్‌కు చేరుకుంటుంది. అదే సమయంలో, దక్షిణాఫ్రికా మొత్తం మూడు మ్యాచ్‌లను (శ్రీలంకపై ఒకటి, పాకిస్తాన్‌పై రెండు) గెలిస్తే దాని %భాజు% 69 కంటే ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో మిగిలిన మూడు మ్యాచ్‌లలో విజయం సాధించి ఆస్ట్రేలియా అవకాశాలను తగ్గించడమే భారత్‌కు ఉన్న ఏకైక అవకాశం. భారత జట్టు అవకాశాలను దెబ్బకొట్టిన ఆసీస్ ను చిత్తు చేసి ముందడుగు వేస్తుందో లేదో చూడాలి.

# గాయం విషయంలో రోహిత్, షమి మధ్య తీవ్ర వాగ్వాదం!



టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ పేస్ బౌలర్ మహ్మద్ షమి మధ్య గొడవ జరిగినట్లు తాజాగా వార్తలు వస్తున్నాయి. న్యూజిలాండ్ తో జరిగిన తొలి టెస్టు సమయంలో బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడెమీలో ఉన్న షమిని రోహిత్ కలిశాడని, ఆ సమయంలో ఇద్దరూ మాటామాటా అనుకున్నట్లు ఆ రిపోర్టు తెలిపింది. రోహిత్ శర్మ, షమి మధ్య సంబంధాలు అంత బాగా లేవని దైనిక్ జాగరన్ రిపోర్టు ఒకటి వెల్లడించింది. న్యూజిలాండ్ తో బెంగళూరులో తొలి టెస్టు ప్రారంభానికి ముందు ఎన్సీఏలో ఉన్న షమిని రోహిత్ కలిశాడు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడుతూ.. షమి పూర్తి ఫిట్ గా లేడని, అతని మోకాలిలో వాపు ఉన్నట్లు చెప్పాడు. దీంతో షమికి కొత్త గాయం అయినట్లు మీడియాలో వార్తలు వచ్చాయి. దీనిపై షమి అసంతృప్తి వ్యక్తం చేశాడు. బెంగళూరు టెస్టులో టీమిండియా ఓడిన తర్వాత మరోసారి షమిని రోహిత్ కలిసిన సందర్భంలో ఇద్దరి మధ్యా వాగ్వాదం జరిగినట్లు దైనిక్ జాగరన్ రిపోర్టు తెలిపింది. “షమి ఎన్సీఏలో ఉన్నప్పుడు రోహిత్ ను కలిశాడు. అయితే తన గాయం పరిస్థితి, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా సిరీస్ కు అందుబాటులో ఉండటంపై మీడియాకు రోహిత్ ఇచ్చిన సమాచారంపై అసంతృప్తిగా ఉన్న షమి అతనితో వాగ్వాదానికి దిగాడు” అని ఎన్సీఏ వర్గాలు వెల్లడించినట్లు ఆ రిపోర్టు తెలిపింది. ఇక తాజాగా ఆస్ట్రేలియా చేతుల్లో రెండో టెస్టులో పది వికెట్లతో ఓడిన తర్వాత కూడా మరోసారి షమిపై రోహిత్ శర్మ స్పందించాడు. “అతని పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాం. ఎందుకంటే సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ఆడే సమయంలో షమి మోకాలిలో వాపు కనిపించింది. దీంతో అతడు టెస్టు మ్యాచ్ సంసిద్ధతకు దెబ్బ తగిలింది. మేము చాలా జాగ్రత్తగా ఉండాలనుకుంటున్నాం.అతన్ని తొందరపడి ఇక్కడికి తీసుకురావాలని అనుకోవడం లేదు. చాలా కాలం కావడంతో అతని విషయంలో 100 శాతం కంటే ఎక్కువ కచ్చితత్వం కోసం చూస్తున్నాం. అతనిపై ఒత్తిడి పెంచాలని భావించడం లేదు. కొందరు ప్రొఫెషనల్స్ అతని పరిస్థితిని గమనిస్తున్నారు. ప్రతి మ్యాచ్ చూస్తున్నారు. అతనికి ఎప్పుడూ తలుపులు తెరిచే ఉంటాయి” అని రోహిత్ స్పష్టం చేశాడు. మహ్మద్ షమి తిరిగి వచ్చేది ఎప్పుడన్నదానిపై స్పష్టత లేదు. అతడు ఆస్ట్రేలియాకు వెళ్లడానికి అంతా సిద్ధంగా ఉన్నా ఇప్పటికీ బెంగాల్ తరఫున సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బెంగాల్ తరఫున ఆడుతూనే ఉన్నాడు. నేషనల్ క్రికెట్ అకాడెమీ నుంచి పూర్తి క్లియరెన్స్ లభించిన తర్వాతే షమికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని బీసీసీఐ భావిస్తోంది. ఆ లెక్కన మూడో టెస్టుకైతే షమి అందుబాటులో ఉండడు. మెల్‌బోర్న్ లో డిసెంబర్ 26 నుంచి ప్రారంభమయ్యే బాక్సింగ్ డే టెస్టుకు మాత్రం షమి తిరిగి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
Roaming News



# అందాల పులి, కిల్లింగ్ లుక్స్

సినిమా ఇండస్ట్రీలో దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ తమన్నా. తెలుగులో శ్రీ సినిమాతో 2005లో ఎంట్రీ ఇచ్చింది. మొదటి సినిమా నిరాశ పరచినా మరో ఛాన్స్ అన్నట్లుగా శేఖర్ కమ్ముల హ్యాపీడేస్ సినిమాలో నటించే అవకాశం దక్కింది. 2007లో విడుదల అయిన హ్యాపీ డేస్ తర్వాత తమన్నా వెనక్కి తిరిగి చూసుకోకుండా పదేళ్లు సినిమా ఇండస్ట్రీలో చక్రం తిప్పింది. ఆహా ఓహో అనిపించే స్థాయిలో అందాల ఆరబోత చేస్తూ ఆకట్టుకుంది. నటనతో మెప్పించింది, డాన్స్‌తో మైమరపించింది. స్టార్ హీరోల సినిమాలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్గా తమన్నా సినిమాలు వెనక్కి తిరిగి చూడకుండా చేస్తూ వచ్చింది. మిల్కీ బ్యూటీ తమన్నా అంటూ ట్యాగ్‌ను సొంతం చేసుకున్న తమన్నా ఈమధ్య కాలంలో కాస్త జోరు తగ్గింది. బాహుబలి తర్వాత పాన్ ఇండియా స్థాయిలో స్టార్ హీరోయిన్‌గా మారుతుందని అంతా భావించారు. కానీ ఆ సినిమా తర్వత నుంచి జోరు తగ్గడం మొదలు అయ్యింది. అయితే మరో హీరోయిన్ అయితే ఇప్పటి వరకు కనిపించకుండా కనుమరుగు అయ్యే వారు. కానీ తమన్నా చాలా తెలివిగా వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ దూసుకు పోతుంది. ఐటెం సాంగ్స్, మ్యూజిక్ వీడియోలను సైతం వదలకుండా నటిస్తూ ఉంది. సోషల్ మీడియాలో ఈమె రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేయడం వల్ల వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. తద్వారా సినిమాల్లో ఛాన్స్ దక్కించుకుంటూ ఉంది. ఆ మధ్య రజనీకాంత్ తో చేసిన వా కావాలయ్య పాట ఏ స్థాయి విజయాన్ని సొంతం చేసుకుందో తెల్సిందే. స్త్రీ 2 సినిమాలో ఈ అమ్మడు చేసిన ఐటెం సాంగ్ విజయంలో కీలక పాత్ర పోషించింది. ఇలా తనకు ప్రాముఖ్యత ఇచ్చే విధంగా తన ప్రతిభను చూపిస్తూనే ఉంది. మిల్కీ బ్యూటీ తమన్నా తాజాగా మరోసారి తన అందమైన ఫోటో షూట్ ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలిచింది. ఈసారి అందాల పులి అన్నట్లుగా పులి స్కిన్ ఔట్ ఫిట్‌లో కనిపించింది. మూడు పదుల వయసులో ఉన్న మిల్కీ బ్యూటీ తమన్నా పాతికేళ్ల లోపు పడుచు అమ్మాయి అన్నట్లుగా ఈ ఫోటోల్లో ఉంది. అందాల పులి అంటూ అభిమానులు పిలుచుకుంటూ ఉన్నారు. పులి తన కోరలతో చంపేస్తే, ఈమె తన చూపులతో చంపేస్తుంది అంటూ కిల్లింగ్ లుక్స్ కి ఫిదా అయ్యాం అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉన్నారు. సోషల్ మీడియాలో ఈ అమ్మడి అందాల ఆరబోత ఫోటోలు వైరల్ అవుతున్నాయి. మరోసారి ఆకట్టుకునే అందాల ఆరబోత ఫోటోలతో తమన్నా వార్తల్లో నిలుస్తోంది.



# నా ఫిట్‌నెస్‌కు కారణం అదే...!

'గడిచిన జీవితం అంతా చదువు, ఆటలతోనే సరిపోయింది. నిజానికి నా లైఫ్‌లో సరదాలు తక్కువే. చిన్నప్పట్నుంచీ క్రమశిక్షణతోనే పెరిగాను. నాన్న సోల్జర్ కావడంతో ఇల్లాంతా ఆర్మీ వాతావరణమే ఉండేది.' అంటూ చెప్పుకొచ్చింది మీనాక్షి చౌదరి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత విషయాల గురించి ఆమె మాట్లాడింది. 'నాన్నకు ఆరోగ్యంపై శ్రద్ధ ఎక్కువ. అందుకే చిన్నప్పట్నుంచీ నన్ను స్పోర్ట్స్ వైపు నడిపించారు. నేను స్విమ్మింగ్, బ్యాట్మింటన్‌లో స్టేట్ లెవల్ ప్లేయర్‌ని. నా ఫిజిక్ ఫిట్‌గా ఉండటానికి కారణం అదే. నాన్న ద్వారా అబ్బిన ప్రపంచజ్ఞానం నన్ను మిస్ ఇండియాగా నిలబెట్టింది. హీరోయిన్ అవుతానని మాత్రం అస్సలు అనుకోలేదు. ఓ విధంగా ఇదంతా మా నాన్న ఆశీర్వాదం' అంటూ ఆనందం వెలిబుచ్చింది మీనాక్షి చౌదరి. వెంకటేశ్‌కి జోడీగా ఆమె నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం సంక్రాంతి కానుకగా విడుదల కానున్న విషయం తెలిసిందే.

# చీర కట్టులో నా సామిరంగ..!

కన్నడ ముద్దుగుమ్మ ఆషికా రంగనాథ్ క్రేజీ బాయ్ సినిమాతో హీరోయిన్‌గా పరిచయం అయ్యింది. కన్నడ సినిమాల్లో ఎక్కువగా నటించిన ఈ అమ్మడు తమిళ్‌లో మొదటి సారి పట్టతు ఆసరన్‌లో నటించింది. 2022లో వచ్చిన ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. కన్నడంలో దక్కిన స్టార్‌డం నేపథ్యంలో తమిళ్, తెలుగు సినిమా ఇండస్ట్రీల్లో ఆఫర్లు వచ్చాయి. తెలుగులో ఈ అమ్మడు ఎంట్రీ ఇచ్చిన సమయంలో మంచి హీరోయిన్‌గా పేరు దక్కించుకుంటుందని, వరుసగా ఆఫర్లు సొంతం చేసుకుంటుంది అంటూ అంతా భావించారు. తెలుగులో ఈఅమ్మడు నటించిన నాగార్జున 'నా సామిరంగ' సినిమా బాక్సాఫీస్ వద్ద ఫ్లాప్ అయ్యింది. అందుకే ఈ అమ్మడు మళ్లీ టాలీవుడ్‌లో కనిపించడం లేదు. కొన్ని సినిమా ఆఫర్లు వచ్చినా చిన్నా చితకా అనే ఉద్దేశ్యంతో తిరస్కరించిందని సమాచారం అందుతోంది. స్టార్ హీరో సినిమాలో ఛాన్స్ కోసం ఆషికా ఎదురు చూస్తుంది. ప్రస్తుతం ఇతర భాషల్లో రెగ్యులర్‌గా సినిమాలు చేస్తున్న ఈ అమ్మడు సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలతో పిచ్చెక్కిస్తోంది. ఇటీవల ఈ అమ్మడు షేర్ చేసిన సముద్రంపై షికారు ఫోటోలు, వీడియోలు వైరల్ అయ్యాయి.



Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986